# గీటురాయి


సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 11-7-2025 15/-


# మళ్ళీ తెరపైకి లౌకికవాదం!




## బీటలు వారుతున్న వివాహ వ్యవస్థ





# గీటురాయి
వారపత్రిక
# GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 27 హైదరాబాద్
శుక్రవారం 11 జులై 2025 రూ.15-00
15 ముహర్రమ్ 1447 హిజ్రీ


**తొలిగీటు**

**అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైన సుగుణాలు మీలో రెండున్నాయి. ఒకటి సహనం, రెండవది తొందరపాటు లేకపోవటం.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





**భాషపై ద్వేషం దేశ భవిష్యత్తుకు ప్రమాదం**

## లోపల...


| | | |
|---|---|---|
| విషాదం | ...... | 04 |
| మళ్ళీ తెరపైకి లౌకికవాదం! | ...... | 05 |
| మహనీయ జుబైర్ బిన్ అవామ్ (రజి) – 2 | ...... | 08 |
| చరితార్థులు–2 : మౌలానా గులాం రసూల్ మెహర్ | ...... | 11 |
| బీటలు వారుతున్న వివాహ వ్యవస్థ | ...... | 14 |
| సఫలీకృతమైన జీవితం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| హిజ్రీ కొత్త సంవత్సరం... కోటి ఆశలతో మనం | ...... | 20 |
| ఇస్లామ్‌లో క్షమాపణకు ఉన్న ప్రాధాన్యత – 2 | ...... | 24 |
| పరివర్తనతోనే ప్రగతి సాధ్యం–2 | ...... | 26 |
| ఒక పోస్టు అనేక బాధ్యతలు | ...... | 28 |
| ఆత్మ విశ్వాసం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| అసలైన సంతోషం | ...... | 34 |


**మేమెందులో తక్కువ? ...**



(అవినీతిలో పోటీపడుతూ, ఏసీబీకి పట్టుబడుతున్న మహిళా అధికారులు)

అవినీతికి ఆడమగ
లేదటోయి భేదము
తేడా చూపకుంటేనే
ఎవరికైన మోదము!
ఆకాశంలో సగము
ఉన్నరు గద వాళ్ళు
మీతో పోటీపడితే
ఎందుకండి కుళ్ళు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# విషాదం

**సంగారెడ్డి జిల్లాలోని** పాశమైలారం రియాక్టర్‌లో పేలుడు ఘటనలో 40 మందికి పైగా మరణించారు. సిగాచీ ఇండస్ట్రీస్‌లో ఈ పేలుడు జరిగింది. పేలుడు జరిగిన ప్రాంతం తీవ్ర విధ్వంసానికి సాక్షిగా మిగిలింది.

ఈ పేలుడు జరిగినప్పుడు 143 మంది ఇక్కడ పనిచేస్తున్నట్లు తెలిసింది. భారీ పేలుడుతో భవనం కుప్పకూలింది. శిథిలాల కుప్పగా మారింది. శిధిలాలలను తొలగించి, శిథిలాల నుంచి మృతదేహాలను, గాయపడిన వారిని వెలికి తీయడం కూడా కష్టంగా మారింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణం ప్రమాదస్థలికి చేరుకుని సహాయ కార్యక్రమాలను పరిశీలించారు. పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబాలు తమ వారి కోసం వెదుకుతున్న దృశ్యాలు కంట తడిపెట్టిస్తాయి. కాలిబొగ్గయిన మృతదేహాలను గుర్తించడానికి డిఎన్ఏ పరీక్షలు చేయవలసి వస్తోంది.

కంపెనీ యాజమాన్యం పూర్తి బాధ్యత స్వీకరించి మరణించిన వారికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, తీవ్రంగా గాయపడిన వారికి పది లక్షల రూపాయలు చెల్లించాలని సి.ఎం. ఆదేశించారు. ఆ మేరకు ముఖ్యమంత్రి సమక్షంలో కంపెనీ యాజమాన్యంతో ఒప్పందం కూడా జరిగింది. బాధిత కుటుంబాలకు తక్షణం ప్రభుత్వం తరపు నుంచి లక్ష రూపాయల సహకారం ప్రకటించారు.

పేలుడు ఘటన జరిగిన 24 గంటల వరకు కంపెనీ యాజమాన్యం అక్కడికి రాకపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహించారు. కంపెనీ తనిఖీలు చేయవలసిన ప్రభుత్వాధికారుల విషయంలో కూడా ఆయన ప్రశ్నించారు. సిగాచీ సంస్థ ఈ యూనిట్‌ను 90 రోజుల పాటు మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రాథమిక విచారణ ప్రకారం రియాక్టర్‌లో ఒత్తిడి పెరగడం వల్ల ప్రమాదం జరిగింది.

ఈ ప్రమాదంలో కంట నీరు పెట్టించే అనేక కథనాలు ముందుకు వచ్చాయి. ప్రేమ వివాహం చేసుకున్న జంట ఒకే షిఫ్టులో పని చేస్తూ ఇద్దరూ చనిపోయిన సంఘటన చాలా మందిని కుదిపేసింది.

సిగాచీ క్లోరో కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 1989లో ప్రారంభమైంది. 2019లో పబ్లిక్ లిమిటెడ్‌గా మారింది. తెలంగాణ, గుజరాత్, కర్ణాటకలో తయారీ యూనిట్లు ఉన్నాయి. ఇక్కడ మైక్రో క్రిస్టలిన్ సెల్యూలోజ్ పౌడర్ తయారు చేస్తారు. ఇది ఔషధ తయారీలో ఉపయోగిస్తారు.

ఘోరమైన ఈ ప్రమాదం అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఇలాంటి ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయవలసిన అవసరం ఉంది. కంపెనీలు తమ వద్ద పని చేస్తున్న కార్మికుల ప్రాణాలకు తగిన భద్రత కల్పించాలి. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలి. అలాగే ప్రభుత్వం కూడా తనిఖీలు క్రమబద్ధంగా జరిగేలా చూడాలి. భద్రతా ప్రమాణాలను పాటించని కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

పోయిన ప్రాణాలను తీసుకురావడం ఎవరికీ సాధ్యం కాదు. కాని భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరక్కుండా ఏం చేయాలన్న ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ఎంతైనా అవసరం.

అబ్దుల్ వాహెద్




# మళ్ళీ తెరపైకి లౌకికవాదం!

**ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొస్బలే ఇటీవల చేసిన వ్యాఖ్య తర్వాత మళ్ళీ రాజ్యాంగంపై, లౌకికవాదంపై చర్చ మొదలయ్యింది. రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించాలని ఆయన అన్నాడు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా ఖండించాయి. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఆరెస్సెస్ ఎన్నడూ ఆమోదించలేదని విమర్శించాయి.**

జూన్ 26వ తేదీన హొస్బలే ఈ వ్యాఖ్యలు చేశారు. ఎమర్జన్సీ కాలంలో ఈ పదాలను రాజ్యాంగంలో చేర్చారని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఇవి లేవని అన్నాడు.

ఈ వ్యాఖ్యలను సామాజిక మాధ్యమంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఖండించారు. ఆరెస్సెస్ ముసుగు తొలగిపోయిందని వ్యాఖ్యానించారు. సమానత్వం, లౌకికవాదం, సమన్యాయాల గురించి మాట్లాడే భారత రాజ్యాంగం వారికి నచ్చదని అన్నారు. ఆరెస్సెస్ వారికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కాదు, మనుస్మృతి కావాలని చెప్పారు. ఆరెస్సెస్, బీజేపీలు దేశంలోని బడుగు బలహీన వర్గాలను మరోసారి బానిసలుగా మార్చాలనుకుంటున్నాయని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల చేతుల్లో ఉన్న రాజ్యాంగమనే ఆయుధాన్ని లాక్కోడానికి

ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ కూడా హొసబలే వ్యాఖ్యలను విమర్శిస్తూ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి ఆరెస్సెస్ చేసే ప్రయత్నాలు రహస్యాలేమీ కావని అన్నారు.

రాజ్యాంగానికి మనుస్మృతి ప్రేరణ కాదంటూ ఆరెస్సెస్ గతంలో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ గుర్తు చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి నవంబర్ 25, 2024వ తేదీన ఈ విషయమై ఇచ్చిన తీర్పును ఆరెస్సెస్ నేతలు చదవలేదా అని ప్రశ్నించారు.

బీజేపీ నేతలు రాజ్యాంగం పట్ల తమ అభిప్రాయాలను ఎన్నడూ దాచుకోలేదు. "అబ్ కి బార్ 400 పార్" అంటూ గత సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యాంగాన్ని మార్చేస్తామని చెప్పిన మాటలు కూడా చాలా మందికి గుర్తుండే ఉంటాయి.

సిపిఎం కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించింది. ఆరెస్సెస్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి దేశాన్ని హిందూరాష్ట్రగా మార్చే ప్రయత్నాల్లో ఉందని చెప్పింది. సి.పి.ఐ., ఫార్వార్డ్ బ్లాక్ పార్టీలు కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించాయి.

కాగా మరోవైపు బీజేపీ నేతలు హొసబలే చెప్పిన మాటలను సమర్థిస్తూ, రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించాలని వాదిస్తున్నారు. స్వయంగా భారత ఉపరాష్ట్రపతి ధన్ కర్ మాట్లాడుతూ ఈ రెండు పదాలు రాజ్యాంగానికి "అల్సర్ల" వంటివన్నారు. అంతేకాదు ఎమర్జన్సీ కాలంలో భారత రాజ్యాంగంలో చేర్చిన ఈ పదాలు భారత సనాతన ధర్మదూషణల వంటివన్నారు.

విచిత్రమేమిటంటే, ఇటీవల మోడీకి సన్నిహితుడిగా మారినట్లు కనిపిస్తున్న కాంగ్రెసు నాయకుడు శశిథరూర్ మాట్లాడుతూ ఆరెస్సెస్ గతంలో రాజ్యాంగం పట్ల వ్యతిరేకత కలిగి ఉండేదని, ఇందులో మనుస్మృతి ప్రభావం లేదని విమర్శించేదని కాని ఇప్పుడు ఈ వాదనను వదిలేసిందని అన్నారు. ఒకవైపు ఆరెస్సెస్ అగ్రనేతలు రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నప్పుడు కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ చేసిన ఈ వ్యాఖ్యలకు అర్థమేమిటి?

భారత రాజ్యాంగం 1950లో రూపొందినప్పుడు ఈ రెండు పదాలు అందులో లేవు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పదాలను చేర్చడం జరిగింది. ఆరెస్సెస్ సెక్యులరిజంపై ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్‌లు కూడా వంతపాడడం మొదలు పెట్టారు. సెక్యులర్, సోషలిస్ట్ భావాలు భారత సంస్కృతి మూల భావాలు కాదని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

ఆరెస్సెస్ అగ్రనేత హొసబలే చేసిన వ్యాఖ్య నిస్సందేహంగా రాజ్యాంగంపై దాడిగానే చాలా మంది చూస్తున్నారు. రాజ్యాంగం పట్ల అసంతృప్తిని, అసమ్మతిని ఆరెస్సెస్, బీజేపీలు ఎన్నడూ దాచుకోలేదు కూడా. కాని గమనించవలసిన విషయమేమిటంటే, 1949 నవంబర్ 26న అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఈ పదాలు లేవు, ఎమర్జన్సీలో ఈ పదాలను చేర్చారని చెప్పడం ద్వారా ఎలాంటి సంకేతాలిస్తున్నారన్నది గుర్తించాలి.

బీజేపీ సంవిధానం ప్రకారం భారత రాజ్యాంగానికి కట్టుబడతానని చెప్పుకున్న పార్టీ. సోషలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యాలకు కట్టుబడతామని చెప్పుకున్నారు. కాని ఇప్పుడు రాజ్యాంగం నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతున్నారు.

నవంబర్ 25, 2024వ తేదీన 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్‌ల ధర్మాసనం దీనికి సంబంధించిన తీర్పు చెప్పింది. రాజ్యాంగంలో సోషలిస్టు, సెక్యులర్ పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటీషన్‌పై విచారించిన న్యాయమూర్తులు స్పష్టంగా తమ మాటలు చెప్పారు. రాజ్యాంగం రూపొందించినప్పుడు ఈ పదాలు లేవన్న కారణంతో ఇప్పుడు తొలగించాలనడం తప్పని అన్నారు. ఈ పదాలను రాజ్యాంగంలో చేర్చడం రాజ్యాంగబద్ధమే అని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆరెస్సెస్ నేత ఈ పదాలను తొలగించాలని చెప్పడమంటే సుప్రీంకోర్టు తీర్పును తిరస్కరించడం కాదా?

అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో సెక్యులర్ అన్న పదం లేదన్నది హొసబలే వాదన. కాని భారత రాజ్యాంగంలోని అధికరణ 25లోని ప్రాథమిక హక్కుల్లో మతస్వేచ్ఛ ఉంది. ఇందులోనే సెక్యులర్ పదం ఉందన్నది మరిచిపోయారా? రాజ్యాంగంలోని సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావాల వంటి విలువలు అన్నీ సెక్యులర్ స్ఫూర్తిని అల్లుకుని ఉన్నవే.

ప్రాథమిక హక్కుల్లో సెక్యులర్ అనే పదంపై అభ్యంతరం లేదు కాని రాజ్యాంగ అవతారికలో సెక్యులర్ పదంపై మాత్రమే అభ్యంతరం ఉన్నట్లయితే ఎన్నికల ప్రచారంలో ఈ పదం పట్ల ప్రేమ ఎందుకు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో హోంమంత్రి అమిత్ షా స్వయంగా సెక్యులర్ పదం పట్ల తన నిబద్ధత

గురించి చెప్పుకున్నారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు కొందరు బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యల తర్వాత బీజేపికి ఎదురుదెబ్బలు తగలవచ్చన్న ప్రమాదాన్ని శంకించి అప్పట్లో సెక్యులర్ పదం పట్ల ప్రేమ ప్రకటించారు.

ఇప్పుడు దత్తాత్రేయ హోస్బలే ఎందుకు సెక్యులర్, సోషలిస్టు పదాల పట్ల తన ఏవగింపు ప్రకటించినట్లు? కారణమొక్కటే, లోలోపల అణచుకున్న అసంతృప్తి లావాలా ఎగజిమ్మింది.

సెక్యులర్, సోషలిస్టు పదాలు ఎమర్జన్సీ కాలంలో రాజ్యాంగ సవరణ ద్వారా అవతారికలో చేర్చబడ్డాయన్నది నిజమే. కాని భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడ్డానికి తీసుకున్న చర్యగానే దీన్ని చాలామంది చూస్తున్నారు. ఎందుకంటే అప్పట్లో ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా ఉద్యమించిన జయప్రకాశ్ నారాయణ్ కు మద్దతుగా ప్రముఖంగా నిలబడింది ఆరెస్సెస్. ఆ విధంగా భారత రాజకీయాల్లో మతతత్వం చొరబడే అవకాశాలను పసిగట్టి ఈ మార్పు చేశారని చాలా మంది విశ్లేషిస్తున్నారు. హరీష్ ఖర్గే ఈ విషయమై ఒక వ్యాసంలో, "గాంధీజీపై కాల్పులు జరిపిన గాడ్సే వంటి వారు పుట్టుకురావడానికి కారణమైన ఆరెస్సెస్ జయప్రకాష్ నారాయణ్ పుణ్యమా అని భారత రాజకీయాల్లో గౌరవప్రదమైన స్థాయికి చేరుకుంది" అని రాశారు.

రాజ్యాంగ రచనా సంఘం సభ్యులందరూ భారత దేశాన్ని లౌకిక దేశంగానే రాజ్యాంగంలో ప్రస్తావించారు.

భారత రాజ్యాంగం, సెక్యులరిజం పరస్పరం విడదీయరానివి అయినప్పటికీ రాజ్యాంగంలోని సెక్యులర్ పదంపై దాడులు అప్పుడప్పుడు జరుగుతూనే ఉన్నాయి.

సెక్యులర్ అనే పదం ఎమర్జన్సీ కాలంలో భారత రాజ్యాంగ పీఠికలో చేర్చబడిందనేది నిజమే. ఎమర్జన్సీ కాలంలో జరిగిన 42వ రాజ్యాంగ సవరణలో ఇంకా అనేక మార్పులు చేశారు. హక్కులపై అంకుశం పెట్టారు. కోర్టు అధికారాల్లో కోత పెట్టారు. పార్లమెంటుకు పూర్తి అధికారాలు కట్టబెట్టారు. రాష్ట్రాల అధికారాలను కేంద్రానికి బదలాయించారు. కాబట్టి సెక్యులర్ అనే పదం రాజ్యాంగ పీఠికలో చేర్చిన సమయమూ, సందర్భమూ రెండు కూడా భారత ప్రజలకు చేదు వాస్తవాల కాలానికి సంబంధించినవే. 42వ రాజ్యాంగ సవరణలో చేసిన ఇతర మార్పులను తర్వాత తొలగించారు, కాని సెక్యులర్ అనే పదాన్ని తొలగించలేదు, ఎందుకంటే ఇది రాజ్యాంగ స్ఫూర్తిలో అంతర్భాగం కాబట్టి. 1973లోనే కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ఈ విషయం చెప్పింది. రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో సెక్యులరిజం అనేది అంతర్భాగం. ఇటీవల అంటే గత సంవత్సరం కూడా ఈ పదాలను తొలగించాలన్న కేసును విచారిస్తూ సుప్రీంకోర్టు ఈ పదాలను తొలగించే అవసరం లేదని చెప్పింది.

సెక్యులర్ అనే పదం ఎమర్జన్సీ కాలంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిందైనప్పటికీ ఇంతకు ముందు చెప్పుకున్నట్లు అధికరణ 25లో స్వేచ్ఛలకు హామీ ఇచ్చిన సందర్భంలో ఇది కనిపిస్తుంది. భారత దేశం బహుళ మతాలున్న రాజ్యం. సెక్యులరిజం లేకపోతే రాజ్యాంగంలోని సమన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలు అసంపూర్ణంగా మిగిలిపోతాయి.

భారతదేశంలో సెక్యులరిజం తనదైన స్వంత భావార్థాలను కలిగి ఉంది. దీనిపై చర్చలు కూడా చాలా జరిగాయి. ప్రభుత్వం దృష్టిలో అన్ని మతాలు సమానమే అన్న విధానమే సెక్యులరిజానికి భూమికగా నిలబడుతూ వచ్చింది. సెక్యులరిజాన్ని పునర్నిర్వచించే ప్రయత్నాలు కూడా చాలా జరిగాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రయత్నాలు మరింత పెరిగాయి. మతం మార్పిడి చట్టాలు, మతాంతర వివాహాలకు పాలనా యంత్రాంగం నుంచి అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలు, లవ్ జిహాద్ కేసులపై రాద్ధాంతాలు– ఇవన్నీ ఈ దిశలో జరిగే ప్రయత్నాల్లోని భాగాలుగానే చూడాలి.

కాని మరోవైపు ప్రభుత్వం సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అంటోంది. వసుధైవ కుటుంబకం అని చెబుతోంది. ఈ వైరుధ్యాలను ప్రజలు కూడా గుర్తిస్తున్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా భారత సమాజం, భారతీయతలో ఉన్న మతసహనం, మత సామరస్యం, లౌకికస్ఫూర్తి అనేవి కొన్ని ప్రయత్నాలతో తుడిచేస్తే తుడుచుకుపోయేది కాదు. లౌకికవాద స్ఫూర్తి సమాజంలో కొనసాగుతూనే ఉంటుంది. అందువల్లనే సెక్యులరిజం అనేది కేవలం భారత రాజ్యాంగ పీఠికలోని ఒక పదం మాత్రమే కాదు, ఇది భారత విలువలకు నిదర్శనంగా నిలుస్తుంది. ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

6/2

## భువిలోనే దివి శుభవార్త పొందిన మహనీయులు

# మహనీయ జుబైర్ బిన్ అవామ్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## ఉహుద్ హీరో

**సేనాధిపతి**

ఉహుద్ పోరాటంలో ప్రవక్తశ్రీ(స) మహనీయ జుబైర్‌కు ఆయన పోరాట పటిమ మూలంగా సేనాధిపతిగా నియమించారు. ఆయన(ర) సేనా నాయకత్వం తాను తీసుకుని మహనీయ మిక్దాద్ బిన్ అస్వద్‌ని తన ఉప నాయకునిలా నియమించుకున్నారు. ఖాలిద్ బిన్ వలీద్ సేనాధిపతి గాను, సఫ్వాన్ బిన్ ఉమయ్య ఉప నాయకుని గాను ఉన్న దళం పైన ధీటుగా దాడి జరిపారు. ఇరుపక్షాల రౌతుల నిష్పత్తి ఒకటికి పదిగా ఉంది. అంటే ముస్లిమ్ రౌతులు యాభై మరి తిరస్కారులు అయిదు వందలు. వీరు కాక ఖాలిద్ క్రింద రెండు వందల మంది రౌతులు వేరుగా రిజర్వ్‌లో ఉన్నారు. కాస్సేపటికే బహుదైవారాధకులు ముస్లిముల దాడి ధాటికి తాళలేక పరుగులు తీశారు.

ఉహుద్ పోరులో ప్రవక్త మహనీయులకు గాయాలయ్యాయి. బహు దైవారాధకులు అయోమయంగా పలాయనమయ్యారు. వారు వెనుతిరిగి మదీనా పురజనుల పైన దాడి చేస్తారేమో అన్న ఆశంకతో తిరస్కారుల్ని వెంటాడటానికి ఎవరెవరు సిద్ధంగా ఉన్నారని ప్రవక్త మహనీయులు(స) అడిగినప్పుడు డెబ్భై మంది సహచర మాన్యులు ముందుకు వచ్చారు. వారిలో మహనీయులు అబూ బక్ర్(ర) మరి జుబైర్(ర) ఉన్నారు.

మహనీయ ఉర్వా(ర) ఒక ఉల్లేఖనంలో తెలిపారు, “మా నాన్న ఇలా చెప్పారు, ‘ఉహుద్ రోజున పోరు ముగిసిన తరువాత ఒక మహిళ అమరగతులయిన వారి వద్దకు వేగంగా రావడం గమనించి ప్రవక్తశ్రీ(స) ఆమెను ఆపడానికి కేక వేశారు. నేను అటు చూసి ఆవిడ మా అమ్మ సఫియ్యా(ర) అని గుర్తు పట్టాను. వెంటనే నేను పరిగెత్తి ఆమె వద్దకు వెళ్ళాను. ఆమె నా రొమ్ము పై ఒక దెబ్బ వేసి (ఆమె బలం గల మహిళ), ‘దూరం జరుగు’ అన్నారు. నేను, ‘ఇది ప్రవక్త ఆదేశం’ అని అన్నాను. ఆమె నిలిచి పోయారు.

ఆమె తన వెంట తెచ్చిన రెండు వస్త్రాలు నాకు ఇచ్చి, ‘ఇవి నేను మా సోదరుడు హమ్జా కొరకు తెచ్చాను, నాకు ఆయన

గురించి తెలిసింది. వీటిలోనే ఆయన్ని ఖననం చేయండి' అని చెప్పారు. నేను ఆ వస్త్రాలు తీసుకున్నాను. 'నేను పరికించి చూస్తే మహనీయ హమ్జా(ర) ప్రక్కనే ఓ అన్సారీ అమరగతి పొంది పడి ఉన్నారు. ఆయన శవం కూడా హమ్జా స్థితిలోనే ఉన్నట్లు గమనించాను. నాకు అభిమానం అడ్డు వచ్చింది, హమ్జా ఖనన వస్త్రంలో రెండు వస్త్రాలు మరి అన్సారీ ఖనన వస్త్రం కూడా లేకుండా ఉండటం ఎలా సాధ్యం? అందువల్ల ఒకటి హమ్జా శవం పైన మరొకటి అన్సారీ శవం పైన కప్పాను."

## ప్రవక్త ప్రశంస

అహ్జాబ్ పోరాటంలో మహనీయ జుబైర్(ర) చూపిన ప్రాణార్పణ శౌర్యం, విధేయతా భావాలకు స్వయంగా ప్రవక్త మహనీయులు ప్రశంసా వచనాలు పలికారు. వాటిలో ఒక వాక్యం, మహనీయ ఇబ్ను వక్కాస్(ర) కు తప్ప మరే సహచరునికీ ఆయన(స) పలుక లేదు. మహనీయ జాబిర్(ర) ఆ సంఘటనను ఉల్లేఖించారు,

"దైవ సందేశ హరులు అహ్జాబ్ పోరాట సమయంలో, 'బనీ కురైజా(యూదు) తెగ సమాచారం తెలుపడానికి ఎవరు వెళ్ళ గలరు?" అని అడిగినప్పుడు మహనీయ జుబైర్(ర), 'నేను' అని ముందుకు వస్తారు. ఆయన(స) మళ్ళీ అడుగుతారు, 'వారి సన్నాహాల భోగట్టా సేకరించి అంద జేయాలి' అని. దానికి మళ్ళీ మహనీయ జుబైర్, 'నేను' అని అంటారు. మూడవ సారి, 'ఆ జాతి వారి భోగట్టా తీసుకు రావాలి' అని అడుగుతారు ప్రవక్తశ్రీ(స). తిరిగి మహనీయ జుబైర్, 'నేను' అని ముందుకు వస్తారు. అప్పుడు ప్రవక్తశ్రీ(స) అంటారు, "ప్రతి ప్రవక్తకు ఒక శిష్యుడు ఉంటాడు, మరి నా శిష్యుడు జుబైర్" అని.

ఈ సంఘటనకు సంబంధించిన తరువాతి ఉల్లేఖనంలో మహనీయ అబ్దుల్లా బిన్ జుబైర్(ర) ఇలా కూడా తెలిపారు,

"అహ్జాబ్ పోరాటం సందర్భంగా ఉమర్ బిన్ అబీ సలమాతో పాటు నన్ను కూడా మహిళలకు రక్షణార్థం నియమించడం జరిగింది. అప్పుడు నేను గమనించాను, మహనీయ జుబైర్ గుర్రం స్వారి చేస్తూ అనేక పర్యాయాలు బనూ కురైజా స్థావరాల వైపునకు వస్తూ పోతూ కనిపించారు. ఒకసారి నేను మహిళల క్యాంప్ నుంచి వస్తూ ఆయన్ని కలసి అడిగాను, "నాన్న గారూ, నేను మిమ్మల్ని ఇటు వస్తూ పోతూ చూశాను" అని. దానికి ఆయన, "నేను వస్తూ పోతూ ఉండగా చూశావా?... దైవ ప్రవక్త అడిగారు, బనీ కురైజా వారి భోగట్టా ఎవరు రాబట్ట గలరు అని, దానికి నేను సమ్మతించాను. తరువాత సమాచారం సేకరించి అందజేస్తే ఆయన(స), "నీ కోసం నా తల్లి దండ్రుల్ని త్యాగం చేద్దును." అని కొని యాడారు.

## యూదులకు గుణపాఠం

హిజ్రీ 7వ సంవత్సరం యూదుల కుట్రలు కుతంత్రాల వల్ల బేజారెత్తి ప్రవక్తశ్రీ(స) యూదుల స్థావరం ఖైబర్ పైన దాడి జరిపారు. వారు ఎదిరించే సాహసంలేక తమ దుర్గాలలో బందీ అయిపోయారు. అక్కడ ఆరు దుర్గాలుండేవి, ఒక దాని తరువాత మరొకటి అయిదు దుర్గాలను జయించారు ముస్లిములు. ఇక అన్నింటి కన్నా పెద్దది కమూస్ దుర్గం. అందులో యూదుల పేరుగన్న పైల్వాను మర్హబ్ ఉండే వాడు. వాడి తమ్ముడు యాసిర్ కూడా పేరు మోసినవాడే. మహనీయ అలీ(ర) మర్హబ్‌ని హతమార్చారు. యాసిర్ కూడా పొగరుతో డాంబిక గీతాలు పాడుకుంటూ వచ్చాడు. అతన్ని చూసి, అతని ప్రగల్భాలు విని మహనీయ జుబైర్ ఉద్రేకంతో ఉడికిపోయారు.

"నేనేమిటో మీ ఖైబర్ వారికి బాగా తెలుసు, నేను జబర్‌లిని ('జుబైర్' 'జబర్' తద్భవం) బలశాలిని, అధీన పరచుకునే వాడిని, కొట్టివేసే వాడిని" అంటూ ముందుకు వచ్చారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలిచారు. యాసిర్ కరవాలంతో దాడి చేశాడు, దాన్ని మహనీయ జుబైర్ తన కరవాలంపై ఆపుతూ గట్టిగా విదిలించారు. యాసిర్ శరీరం ఊగి పోయింది. అంతే, రెప్పపాటు కాలంలో మహనీయ జుబైర్(ర) కరవాలం అతని మెడను ఛేదించి వేసింది. ఆ తరువాత అది చూసిన యూదుల సిపాయిలు దుర్గం మూలల్లో దాక్కున్నారు.

## ప్రవక్త ధ్వజం

మక్కా విజయం సందర్భంలో మహనీయ హాతిబ్, మక్కా వాసులకు వ్రాసిన లేఖను పట్టుకోవడానికి మహనీయ అలీ(ర) తోపాటు మహనీయ జుబైర్(ర)ని కూడా పంపుతారు ప్రవక్త మహనీయులు(స). ఆ సందర్భంలో వేర్వేరు దళాలు ఏర్పరచి మహనీయ జుబైర్‌ని ముహాజిరుల దళానికి నాయకత్వం ఇచ్చారు ప్రవక్తశ్రీ(స). అందులో స్వయాన ప్రవక్తశ్రీ(స) ఉన్నారు. అలా ప్రత్యేకంగా ఆయన ప్రవక్త ధ్వజ వాహకు లయ్యారు. ఆ తరువాత మక్కా చేరినప్పుడు ప్రవక్త మహనీ

యులు తన ధ్వజం నిలబెట్టమన్న చోట దాన్ని నిలబెట్టారు.

## ఖలీఫాల కాలంలో

హిజ్రీ 13వ సంవత్సరం జోర్డాన్‌లోని డెల్టా వంటి యర్మూక్ అనే చోట ముస్లిములకు- క్రైస్తవులకు మధ్య భీకర పోరాటం జరిగింది. అందులో ముస్లిముల సంఖ్య, కుమ్మక్కు అందిన తరువాత దాదాపు నలభై, నలభై రెండు వేలు, మరి క్రైస్తవుల సంఖ్య రెండున్నర లక్షలకన్నా అధికంగా ఉంది. మహనీయ జుబైర్ కూడా ఈ అత్యంత ముఖ్యమయిన చారిత్రక యుద్ధంలో పాల్గొన్నారు. నిస్సంకోచంగా ఆయన ఒంటరిగానే రోమను సిపాయిల అనేక పంక్తుల్ని నేల మట్టం చేశారు, శత్రు సేనను చెదరగొట్ట గలిగారు. ఈ పోరాటంలో మహనీయ జుబైర్ ఎంత శౌర్యం, ధైర్యం, సాహసంతో శత్రు సంహారం చేశారో దాన్ని సహచర మాన్యులు స్వయంగా కొనియాడారు.

యర్మూక్ యుద్ధంలో సహచర మాన్యులు, ఆయనతో, మీరు దాడి జరపడంలో తీవ్రత కనబరచకపోవడం వల్ల మేము కూడా తీవ్రంగా పోరాడలేక పోతున్నాము, అన్నారు. దానికి ఆయన, నేను తీవ్రత కనబరిస్తే మీరు అలా చేయలేరు అన్నారు. వారు, అలా ఎన్నటికీ కాదు అని పలికారు. అంతే, ఆయన

(మహనీయ జుబైర్) శత్రు సేన వరసల్ని ఛేదించుకుంటూ మున్ముందుకే దూసుకుపోయారు. అయితే ఆయనకు ఎవ్వరూ తోడ్పాటు ఇవ్వలేకపోయారు. ఆయన తిరిగి వచ్చే సమయాన అన్ని వైపులా చుట్టుముట్టారు. ఆయన భుజం పైన, మునుపు బద్ర్‌లో లోతుగా తగిలిన గాయం వద్ద మరో గాయమయింది.

## అమరగతి

ఒంటెల యుద్ధం ముగిసిన తరువాత ఆయన మదీనా వైపునకు బయలుదేరిన సందర్భంలో అమ్ర్ బిన్ జర్మూజాన్ ఆయన వెంట పడ్డాడు. సబా లోయలో నమాజ్ సంకల్పంతో నిలబడి ఉండగా అమ్ర్ గురి చూసి ఆయనపై బాణం వేశాడు, ఆయన వెంటనే అమరగతి పొందారు. ఆయన తన వెనకాల ధనం ఏమీ వదలలేదు. రెండు చోట్ల నేల, తోటలు ఉండేవి. ఇంకా మదీనాలో 11 ఇండ్లు, బస్రాలో రెండు, ఈజిప్టులో ఒకటి ఉండేవి.

మహనీయ జుబైర్(ర) బాగా దానధర్మాలు చేసేవారు. అగత్యపరుల్ని ఎలాగయినా ఆదుకునేవారు. అందువల్ల రుణగ్రస్తులయ్యారు. ఒక ఉల్లేఖనంలో అబ్దుల్లా బిన్ జుబైర్ తెలిపారు, "ఆయన అమరగతి పొందిన తరువాత లెక్క కడితే మొత్తం అప్పు 22 లక్షలయింది. ఆ రుణం తీర్చడానికి ఒక భూమి అమ్మడానికి యత్నిస్తే ఒక లక్షా డెబ్బయి వేల భూమి 16 లక్షలకు అమ్ముడుపోయింది. మిగతా భూమి సయితం కొందరు సహచరమాన్యులు ఆరు లక్షలకు కొన్నారు. ఆ తరువాత నేను నాన్నగారి రుణాల నుంచి విముక్తుణ్ణి అయ్యాను." ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.

**Bank Details**

Geeturai Weekly
Account No:1042789768
Bank: Central Bank of India
Noorkhan Bazar Branch,
IFSC Code. CBIN0282407
Hyderabad- 500 002, Telangana

Office Address: Geeturai Weekly
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com


# 'చరితార్థులు'-2



# మౌలానా గులాం రసూల్ మెహర్

## (1885 -1971)

**87**




**మాతృభూమి** విముక్తి పోరాటం దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేసిన కలం యోధులలో ఒకరైన మౌలానా గులాం రసూల్ మెహర్ పంజాబ్ రాష్ట్రం జలంధర్ జిల్లా ఫూల్‌పురాలో 1895 ఏప్రిల్ 15న జన్మించారు. ప్రాథమిక విద్యను ఖంబ్రా, ప్రాథమికోన్నత విద్యను జలంధర్‌లో పూర్తి చేసిన ఆయన లాహోర్ వెళ్ళి ఇస్లామియా కళాశాలలో ఉన్నత విద్యాభ్యాసం గావించారు. పరాయిపాలనలో మగ్గుతున్న స్వదేశం, ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యల నేపథ్యంలో యువకుడు గులాం రసూల్ స్వాతంత్ర్యోద్యమం దిశగా నడక సాగించారు. 1912లో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ప్రారంభించిన విప్లవోద్యమ సంస్థ 'హిజ్‌బుల్లా'లో చేరి వలసపాలకుల నుండి మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను అర్పించడానికి సిద్ధమని ఇతర సభ్యులతో పాటు ఆయన కూడా దీక్షపూనారు. మౌలానా ఆజాద్ స్థాపించిన 'అల్ హిలాల్' ఉర్దూ పత్రికలోని కవితలు, వ్యాసాలు ఆయనను ఆకట్టుకున్నాయి. అక్షరాల ఆకర్షణలో పడిన ఆయన 1921లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా జఫర్ అలీ ఖాన్ పునఃప్రారంభించిన 'జమీందార్' ఉర్దూ పత్రికలో చేరారు. జాతీయోద్య మంలో భాగంగా ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్నప్పుడు ఆయన 'జమీందార్' పత్రికలో ప్రధాన బాధ్యతలు చేపట్టి కలంయోధునిగా తన సత్తా చాటారు. ఆ పత్రికలో పని చేస్తున్న సమయాన ఆయనకు ప్రఖ్యాత ఇస్లామీయ విద్వాంసులు అల్లామా షిబ్లీ నోమానీ, అల్లామా ముహ్మద్ ఇక్బాల్, నవాబ్ వఖార్-ఉల్-ముల్క్ లాంటి ప్రముఖులతో పరిచయం ఏర్పడింది. ఆ క్రమంలో మంచి ఉద్యోగం ఆశిస్తూ హైదరాబాద్ సంస్థానం వెళ్ళి కొంత కాలం గడిపి సాహిత్యం-రాజకీయం పట్ల వినూత్న ఆలోచనలతో ఆయన తిరిగి లాహోర్ చేరుకున్నారు. 1927లో 'ఇంక్విలాబ్' ఉర్దూ పత్రికను మిత్రులు అబ్దుల్ మజీద్ సహకారంతో వెలువరించారు. ఒకవైపు స్వేచ్ఛా - స్వాతంత్ర్యాలు కోరుతూ సాగుతున్న జాతీయోద్యమంలో పాల్గొంటూ, అక్షర యోధునిగా రచనా వ్యాసంగాన్ని తన ప్రధాన వ్యాపకంగా చేసుకున్న మౌలానా గులాం రసూల్ స్వయంగా చారిత్రక, సాహిత్య సంపదను సృష్టించారు. స్వంత రచనలు మాత్రమే కాకుండా వందలాది పుస్తకాలను తర్జుమా చేసి ప్రజలకు అందించారు. వృత్తిరీత్యా పెషావర్‌లో స్థిరపడ్డారు. ఆయన భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి భారత్-పాకిస్తాన్‌లుగా విభజన జరిగాక పెషావర్‌ను కార్యస్థానం చేసుకుని పాకిస్తాన్‌లో ఉండిపోయారు. ఎక్కడున్నా, ఎంతటి గొప్ప స్థానంలో ఉన్నా 'మా స్వగ్రామంలో ఉన్నప్పుడు స్వర్గంలో ఉన్నట్టు అనిపిస్తుంది. హఠాత్తుగా అక్కడి నుండి పెకలించే సరికి ఎడారిలో గమ్యం ఎరుగని గమనంలో ఉన్నట్టుగా అన్పిస్తుంది' అంటూ స్వగ్రామాన్ని స్వర్గంగా అభివర్ణిస్తూ, స్వంత గడ్డ మీద అపారమైన ఆపేక్షను వ్యక్తంచేసిన మౌలానా గులాం రసూల్ మెహర్ 1971 నవంబర్ 16న పెషావర్‌లో అంతిమ శ్వాస విడిచారు. ✤




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




# భాషపై ద్వేషం దేశ భవిష్యత్తుకు ప్రమాదం

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**'ఇంగ్లీషు మాట్లాడేవారు త్వరలో సిగ్గుపడతారు'** అని ఇటీవల ఢిల్లీలో జరిగిన 'భారతీయ భాషల అభివృద్ధి సదస్సు'లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్య కేవలం ఒక రాజకీయ వ్యాఖ్య మాత్రమే కాదు. అది భారతదేశంలోని భాషా స్వేచ్ఛపై, అభివృద్ధి ఆకాంక్షలపై, స్వీయ అభివ్యక్తి స్వాతంత్ర్యంపై చేసిన గాయంగా చూడాలి. భారత రాజ్యాంగం భాషా సమానత్వానికి నిలువెత్తు చిహ్నంగా నిలుస్తుంటే, కేంద్ర మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఒక భాషను 'సిగ్గుగా' అభివర్ణించడం అత్యంత శోచనీయ మైన విషయం.

భారతదేశం వేలాది భాషలతో, శతాబ్దాల భిన్న భాషా వారసత్వం కలిగిన దేశం. ఇక్కడ హిందీ, తెలుగు, ఉర్దూ, బెంగాలీ, తమిళం, మరాఠీ–అన్నీ మాతృభాషలే కాదు, దైనందిన జీవితంలో భావ ప్రకటనకు సాధనాలు కూడా. అటువంటి దేశంలో ఇంగ్లీషును విమర్శిం చడం, అది కూడా ఇంగ్లీషు మాట్లాడేవారు సిగ్గు పడాలి అనే అర్థంలో మాట్లాడడం, దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజల విద్యా హక్కును, వారి మనో భావాలను కించపరచడమే.

ఇంగ్లీషు అనేది వలస పాలకుల భాషే కాదు, స్వీయ సాధికారత సాధించేందుకు ఉపయోగపడే అంతర్జాతీయ భాష. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మదర్ థెరిస్సా, అమర్త్యసేన్ లాంటి మహ నీయులు తమ భావాలను ప్రపంచానికి ఇంగ్లీషులోనే వ్యక్తీకరిం చారు. ఈ దేశపు యువతీ యువకులు, పట్టణాల్లో విద్యార్థులు, గ్రామాల్లో ఉపాధి మార్గాలు వెతుక్కుంటున్నవారు, అందరూ ఈ భాషను ఉపయోగిస్తున్నారు. వారందరికీ 'సిగ్గు' అనే మాట వర్తింపజేయాలంటే, అది ప్రజల అభివృద్ధి ఆకాంక్షలపై నీళ్ళు చల్లడమేకాక, వారిని ఘోరంగా అవమానించడం కూడా!

## ఒకే ప్రభుత్వంలో ద్వంద్వ ధోరణి ఎందుకు?

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ వేదికలపై ఇంగ్లీషు టెలిప్రాంప్టర్ వాడుతూ ప్రసంగించిన దృశ్యాలు అందరికీ తెలిసినవే. కేంద్ర ప్రభుత్వం ప్రచారానికి వాడే వెబ్‌సైట్లు, పథకాల వివరాలు, వీడియోలు అన్నీ ఎక్కువగా ఇంగ్లీషులోనే ఉంటు

ఇంగ్లీషు మాట్లాడే వారు 'సిగ్గుపడాలి'
అనే మాట వాడటం, నైతికంగా తప్పు
మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో
వ్యక్తిగత అభిరుచుల్ని అణచివేయాలనే
ప్రయత్నం కూడా! దీనిని
దేశ భవిష్యత్తుపై పరోక్ష దాడిగా
చూడవచ్చు.

న్నాయి. అదే ప్రభుత్వంలోని హోంమంత్రి, అదే భాషను మాట్లాడేవారు 'సిగ్గుపడతారు' అని అనడం అర్థరహితంగా, అహంకార పూరితంగా, బాధ్యతారహితంగా ఉంది. ఇది కేవలం భాషపై అసహనం కాదు, ప్రజల స్వేచ్ఛపై, అభివృద్ధిపై చేసిన దాడి.

ఇది అక్కడితోనే ఆగడం లేదు. విద్యా వ్యవస్థపైనా తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపేలా ఉంది. బీహార్, ఒడిశా, తెలంగాణ, మధ్య ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో లక్షలాది ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు ఇంగ్లీషు మాధ్యమంలోకి మారుతున్నాయి. విద్య, వైద్యం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పని చేసే ప్రతి ఉద్యోగికి ఈ భాష అవసరం. UPSC పరీక్షలో మెయిన్స్ ప్రశ్నల మాధ్యమం ఇంగ్లీషే. IIT\T, IIM\T, AIIMSలు, ISRO – దేశం గర్వంగా నిలిచిన ప్రతి సంస్థ, ఇంగ్లీషు ఆధారిత వ్యవస్థలపైనే నడుస్తోంది.

ఈ వాస్తవాల మధ్య, ఒక మంత్రిగా అమిత్ షా వ్యాఖ్యలు చేసిన తీరు ప్రజల బుద్ధిని అవమానించడమే.

## రాజకీయ ప్రయోజనాలకు భాషల్ని వాడుకోవద్దు

దక్షిణ రాష్ట్రాలు, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో భాషలపై గాఢమైన గౌరవం ఉంది. హిందీని పై చేయిగా ప్రదర్శించేందుకు ఇతర భాషలను అవమానించడం, చిన్నచూపు చూడడం అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. భాషపై ప్రేమ పేరుతో ఇతర భాషలను తక్కువగా చూడటం ప్రజాస్వామ్య భావనకు విరుద్ధం. ఇంగ్లీషును విమర్శించడం, భాషా స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నంగా మారకూడదు. ఇది ఓట్ల రాజకీయానికి పరాకాష్ఠ.

భాషలు గెలుపోటముల వస్తువులు కావు. అవి ప్రజల మధ్య సహజ వారధులు. 'ప్రతి భాషకూ సమాన గౌరవం ఉండాలి' అనే రాజ్యాంగ ప్రమాణాన్ని అమలు చేయాల్సింది పోయి, కొందరు నాయకులు భాషల్ని రాజకీయ ఆయుధాలుగా మలచడంలో ఆసక్తి చూపుతున్నారు. ఇది దేశ సమైక్యతకు ముప్పు.

## భాషను అవమానించడం, భవిష్యత్తును తక్కువగా అంచనా వేయడమే

నేటి కుటుంబాల్లో తాతయ్య తెలుగు మాట్లాడుతున్నా, మనవడు ఇంగ్లీషులో చదువుతున్నాడు. ఉపాధ్యాయుని మాటలలో అర్థం, టెక్నాలజీ భాషలో ప్రయోగం, ఇంట్లో పిల్లల కలల భాషగా ఇంగ్లీషు మారింది. భాషను హేళన చేయడం, భవిష్యత్తు ఆశలను హేళన చేయడమే.

ఇంగ్లీషు మాట్లాడే వారు 'సిగ్గుపడాలి' అనే మాట వాడటం, నైతికంగా తప్పు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత అభిరుచుల్ని అణచివేయాలనే ప్రయత్నం కూడా! దీనిని దేశ భవిష్యత్తుపై పరోక్ష దాడిగా చూడవచ్చు.


భాషా వివక్షతో వ్యక్తిత్వాలను చిదిమేయలేరు. అభివృద్ధి పట్ల భయం చూపించి స్వేచ్ఛను హరించలేరు.

మన దేశానికి భాషల వైవిధ్యం ఒక బలమైన లక్షణం. నాయకులు ప్రజల అభిరుచుల్ని గౌరవించే ప్రయత్నం చేయాలి. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల భాషా, యాసలను తుడిచివేయడాన్ని ప్రజలు సహించే పరిస్థితిలో లేరు. అందుకే

భాషల పట్ల గౌరవమే నిజమైన దేశభక్తి. భాషల పట్ల ద్వేషం దేశానికి, దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

- డాక్టర్ ముహమ్మద్ హసన్,
అసిస్టెంట్ ప్రొఫెసర్



# బీటలు వారుతున్న వివాహ వ్యవస్థ

"నీ కౌగిలిలో తలదాచి నీ చేతులలో కనుమూసి జన్మజన్మకు జతగా మసలే వరమే నన్ను పొందని, నింగి సాక్షి, నేల సాక్షి నిను వలచిన నా మనసే సాక్షి, వేడుకలోను వేదనలోను పాలూ తేనెలా ఉందాము. ఈ పాట అమలినమైన ప్రేమ, ఆలుమగల మధ్య వుండే అన్యోన్యతను గూర్చి తెలియజేసే చక్కని ప్రణయగీతం ఇది. కార్తీక దీపం సినిమాలోనిది ఈ పాట. 'నీ కోసం యవ్వన మంతా దాచాను మల్లెలలో, నీ కోసం జీవితమంతా వేచాను సందేలలో... ఈ పాట నాయికా నాయకుడి మధ్యసాగే చక్కని గీతం. మూడుముళ్ళు సినిమాలోనిది ఈ పాట. నాయికా నాయకుడి మధ్య వుండే విరహం, వేదన, ఆనందం, ఉద్వేగాల నడుమ సాగే చక్కని గీతాలు అవి. తరం మారినా సాహిత్య విలువలు తగ్గినా ఏ తరం వారైనా ఇష్టపడే పాటలు అవి. ఈ తరం వారు తప్పని సరిగా విని ఆలోచించి అర్థం చేసుకొని మసలుకోవాల్సిన పాటలు అవి.

మరి ఈ కాలం యువత నిజంగా అలా స్వచ్ఛంగా తెల్ల కాగితం మాదిరిగా ఉంటున్నారా? వుంటే మే 11 న సోనమ్ - రఘువంశీల పెళ్ళి బంధువుల సమక్షంలో ఘనంగా జరిగింది. పెళ్లి అనంతరం హనీమూన్ కోసం మేఘాలయకు బయలుదేరిన ఇద్దరు, ఇక ఆ తరువాత జరిగిన పరిణామాలు గత వారం రోజులుగా టీవీలలో పత్రికలలో, సోషల్ మీడియాలో ఐతే చెప్పనక్కర్లేదు, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ అంశం గురించి చర్చ జరుగుతోంది. ఒక రకంగా చెప్పాలంటే "ఆపరేషన్ సింధూర్" అంశం డైవర్ట్ అయ్యేంతగా ఈ సంఘటన అందరిని కదిలిస్తోంది. రోజు రోజుకు పతనం అంచుకు వెళ్తున్న మానవ సంబంధాలకు మచ్చుతునక ఈ సంఘటన. పెళ్ళికి ముందే సోనమ్ స్నేహితుడు రాజ్ కుశ్వాహతో ప్రేమలో వున్నట్లు, తల్లిదండ్రులు బలవంతపు పెళ్ళి చేసినట్లు, ప్రస్తుతం సోనమ్ గర్భవతి అని కూడా వార్తలు వస్తున్నాయ్. ఇంకా నిజాలు తెలవాల్సి ఉంది. (విచారణలో) ఆ మధ్యకాలంలో బెంగుళూర్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భార్య వేధింపులు భరించలేక వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన. అనంతరం అతడి వద్ద దొరికిన లేఖ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులకు విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సంఘటనలో కూడా భార్య వివాహానికి ముందే మరొక వ్యక్తితో సన్నిహితంగా ఉందన్న విషయం తెల్సుకొని అనంతరం ఆమె వేధింపులు తాళలేక మరణిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నాడు. ఈ అంశం కూడా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇక మరొక చోట భర్త వేధింపులు భరించలేక విడాకులు కోరిన భార్యకు కోర్టు విడాకులు మంజూరు చేయగా ఇంటికి వచ్చిన కూతురికి తండ్రి చేసిన సన్మానం కూడా ఎక్కువగా వైరల్ అయింది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్ జిల్లా భోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో "ముస్కాన్" అనే మహిళ ప్రియుడు జునైద్ మాయలో పడి పిల్లలు వుంటే పెళ్ళి చేసుకోనని చెప్పడంతో తన ఇద్దరు పిల్లలకు అర్యాన్ (4) అయాన (1)లకు రసగుల్లలో విషం కలిపి కన్న బిడ్డల్ని చంపిన సంఘటన (19-06-2025) సంచలనం కల్గించింది.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మరొక సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గంట వీధి కాలానికి చెందిన ప్రైవేటు సర్వేయర్ తేజేశ్వర్ (32) కు కర్నూల్ జిల్లా కేంద్రంలోని కర్నూల్ ఎస్టేట్‌కు చెందిన ఐశ్వర్యతో మే - 18న వివాహం జరిగింది. ఐశ్వర్యకు పెళ్ళికి ముందే కర్నూల్‌లో తన తల్లి పనిచేసే బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుమల రావుతో సంబంధం ఉంది. ఇద్దరి పెళ్ళికి ఇష్టపడని తిరుమల్ రావు సూచన మేరకు (తేజేశ్వర్‌ను) సుఫారి ఇచ్చి హత్య చేయించింది ఐశ్వర్య. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.

ఈ మధ్య కాలంలోనే మెదక్ జిల్లాలో ముగ్గురు పిల్లలకు పెరుగన్నంలో విషం కలిపి చంపిన తల్లి ఉదంతం అందరినీ తల్లడిల్లేలా చేసింది. ఈ సంఘటనలో తల్లి జైలు పాలయ్యింది, తండ్రి పిల్లలు లేని ఒంటరివాడయ్యాడు. ఇందులో క్షణికమైన ఆనందమే కనిపించింది తప్ప, ఆ తర్వాత ఏమిటనేది ఒక్క క్షణం ఆలోచిస్తే ఏ కుటుంబంలోనైనా ఇలాంటి హింసాత్మక సంఘటనలు జరగవు అనేది నా అభిప్రాయం.

ప్రపంచంలో ఏ దేశంలో లేని గొప్పతనం భారతీయ వివాహ వ్యవస్థకు ఉంది. (అలా అని నేను వేరే దేశాల సంస్కృతి సంప్రదాయాలను కించపర్చటం లేదు) వేల సంవత్సరాలుగా సనాతనంగా ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది ఈ సంప్రదాయం. మారిన జీవనశైలి, అలవాట్లు, మితిమీరి ఆకర్షింప బడుతున్న పాశ్చాత్య జీవనశైలి, శారీరక ఉద్వేగాలను నియంత్రించుకోలేని వయస్సు, పెద్దల పర్యవేక్షణ లేకపోవటం, యాంత్రిక సంబంధాలుగా మారిన మానవ సంబంధాలు. వెరసి ఈ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ఎక్కడో చోట ఇలాంటి సంఘటనలు జరుగుతూ మారుతున్న యువతకు ఈ రకం సంఘటనలు గట్టి హెచ్చరికలు చేస్తూనే వున్నాయ్. కానీ యువతలో ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదన్నది బహిరంగ సత్యం. ఓ వైపు డ్రగ్స్, గంజాయి, మద్యం మొదలైన అలవాట్లతో యువత ఓ వైపు పక్కదారి పడ్తుంటే, మరోవైపు మహిళలు సైతం తాము మాత్రం ఏం తక్కువ అంటూ ఈ మధ్య కాలంలో హింసాత్మకమైన నేరచర్యల్లో పాలుపంచుకోవడం బాధకల్గించే అంశం. బాధితులుగా వున్న మహిళా లోకం నేరస్తులుగా మారటం ఏంటన్నది ఇప్పుడు అందరి మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్న.

ఆ మధ్య సుప్రీంకోర్టు ఓ విడాకుల కేసు గూర్చి వాదిస్తూ భారతీయ శిక్షాస్మృతిలో 498(ఏ) దుర్వినియోగం జరుగుతున్నదని పేర్కొనటం అందరికి తెలిసినదే. అందుకే ఆ సెక్షన్‌లో చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు భార్యబాధితులు ఎక్కువగా ఉంటున్నట్లుగా పలు నివేదికలు తెలియజేస్తున్నాయ్.

దీనికంతటికీ ఎంతో పటిష్టమైన వివాహ వ్యవస్థ ఇలా బీటలు వారటం ఏమిటి! రానురాను మానవ సంబంధాలు ఇలా హింసాత్మకంగా మారటంతో ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అర్ధం కాని విషయం. సీతను, సావిత్రిని, ద్రౌపదిని, సతీ అనసూయను ఆదర్శంగా భావిస్తారు. నేటి కాలంలో కస్తూర్బా గాంధి, సావిత్రి బాయిపూలే, రమాబాయి, మొదలైన వారిని ఆదర్శ స్త్రీ మూర్తులుగా భావిస్తారు. మరి నేటి యువతులు వారిని వారి త్యాగాలను లేశ మాత్రమైనా అనుసరిస్తున్నారా ? అనేది ఆలోచించాల్సిన అంశం. నేటికి ప్రపంచంలో చాలా చోట్ల స్త్రీలను బానిసలుగా చూసే ఆచారం ఇంకా పోలేదు. స్త్రీలకు కల్పించ బడిన స్వేచ్ఛను ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటున్నారో అని ఆలోచించాల్సింది పోయి ఎదుటివారి జీవించే హక్కును కాలరాయటం బాధ కల్గించే అంశం. అలా అని పురుషులు కూడా స్త్రీలపై హింసాత్మక చర్యలకు పాల్పడకూడదు.

స్వాతంత్ర్యం వైపు అడుగులు వేస్తూ ఎదుటివారి విలువైన జీవితాలను నాశనం చేసే హక్కు ఎవరిచ్చారనే ప్రశ్నలు రావడం సహజం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అంటాడు కారల్ మార్క్స్. "డబ్బుకు" అతిగా విలువ ఇవ్వడం, డబ్బును బంధాల మధ్య చొప్పించడం, "వివాహం" అనేది విలాసంగా ప్రదర్శించుకోవటం, ఘనంగా పెళ్లి చేసి, అనేక సామాజిక మాధ్యమాలలో ప్రచారం నిర్వహించుకొని, సంవత్సరం తీరకుండానే విడాకులు తీసుకున్న జంటలు కోకొల్లలు. మరి ఎందుకు ఈ ఆర్భాటపు విలాసాలు అనేది ఆలోచించాలి. ఇద్దరి మధ్య అన్యోన్యత, సహకారం, సమన్వయము, ఇరు కుటుంబాల మధ్య పరస్పర అవగాహన లేనప్పుడు ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా ఎవరి బ్రతుకు వారు బ్రతకడం ఉత్తమం. కాని హింసాత్మక పద్ధతులు, మోసంతో కూడిన ఆలోచనలు చేయడం, నేరం చేసిన తర్వాత జరుగబోయే పరిణామాలు ఊహించలేకపోవడం అజ్ఞానంతో కూడిన చర్యలుగానే భావించాలి.

బెంగుళూర్ మిర్రర్ పత్రిక కథనం ప్రకారం 2024లో 36, 952 విడాకులు, 2022లో 66, 863, 2023 లో 41, 230 విడాకుల కేసులు మంజూరైనట్లు గత ఐదు సంవత్సరాలలో 1.95 లక్షల విడాకుల కేసులు నమోదైనట్లు గత మార్చ్ 22 (2025) లో ఓ నివేదికను విడుదల చేసింది. పిల్లలు ఏ వాతావరణంలో వున్నారో అలాంటి లక్షణాలే అబ్బుతాయని ఎన్నో పరిశోధనలు రుజువు చేశాయి. విస్తృతంగా వ్యాపిస్తున్న సోషల్ మీడియా, సినిమాలలో చూపిస్తున్న హింసాత్మక సన్నివేశాలు, మారిన ఆలోచనా విధానం వైపు నేటి యువత తమలో తాము నియంత్రణ కోల్పోయి ఇలాంటి సంఘటనలకు పాల్పడటం బాధ కల్గించే విషయం. ఏది ఏమైనా పిల్లలకు పెళ్ళికి ముందే ప్రీ మారిటల్ కౌన్సిలింగ్ అనేది నిర్వహించడం భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడితే జరగబోయే పరిణామాలు కూడా వారికి చెప్తే ఇలాంటి హింసాత్మక ఆలోచనలకు కొంత మేరకు ఫుల్‌స్టాప్ పడ్తుందనేది నా అభిప్రాయం.




# సఫలీకృతమైన జీవితం

నసీరా బేగం

**ధనం** కావలసిన వస్తువులన్నింటినీ కొనగలదు కాని సుఖవంత మైన జీవితాన్ని కొనజాలదు. ఇంకా సంతోషకరమైన జీవితం అంటే ఇహలోకంలోని ఈ జీవితం భోగభాగ్యాలతో గడపడం అని కూడా అర్థం ఎంతమాత్రం కాదు. సాధారణంగా మనిషి తన సుఖ సంతోషాల కోసం ఇష్టానుసారంగా జీవిస్తాడు. తన ఆనందం కోసం రకరకాల ఆహ్లాదకరమైన వినోద వస్తువులు, వినోద కార్యాల వెంట పడతాడు. ఫ్యాషన్ మోజులో పడి నూతన వస్తువుల వెంటపడతాడు. ఇవన్నీ అతనికి సంతోషకరమైన, సుఖవంతమైన జీవితాన్ని ప్రసాదిస్తాయని భావిస్తాడు. ఇవన్నీ అతనికి కొంతవరకు ప్రశాంతతను చేకూరుస్తాయేమో కాని వాటి వెంటపడితే అవి ఎండమావులే అవుతాయి తప్ప మరేమీ కావు.

కాని ఇస్లామ్ ధర్మం మనిషికి సూచించే కొన్ని సూచనలు అతని పూర్తి జీవితాన్ని సంస్కరిస్తాయి. అతనికి సుఖాన్ని, ప్రశాంతతను, సంతోషాన్ని ప్రసాదిస్తాయి. అతని గౌరవాన్ని పెంచుతాయి. అతని పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేస్తాయి. అంతేకాదు, అతని ప్రతి పని, ప్రతి కార్యం అల్లాహ్ దృష్టిలో కూడా అత్యంత ప్రీతికరమై పోతుంది. ఇంకా ఆత్మ ప్రేరణ ద్వారా జరిగే కార్యకలాపాల ద్వారా అల్లాహ్ ముందు ఒక నేరస్తుడుగా నిలిచి పోవటం నుంచి కూడా అవి కాపాడతాయి.

ఇస్లామ్ సూచించే ముఖ్యమైన విషయం ఏమిటంటే ఒక మనిషిపై రెండు విధాల హక్కులు ఉంటాయి. 1) అల్లాహ్ హక్కులు 2) తోటి మానవుల (దాసుల) హక్కులు. అల్లాహ్ హక్కు ఏమిటంటే అల్లాహ్‌ను విశ్వసించాలి. ఆయన్ని ఆరాధించాలి. ఆయన పట్ల భయాన్ని కలిగి ఉండాలి. ఇంకా ఆయన బోధించిన సత్యాలను అంగీకరించాలి, ఆచరించాలి. ఇంకా తోటి మానవుల హక్కులు కూడా ఒకరిపై మరొకరికి కొన్ని ఉన్నాయి. అవి ఏమిటో, ఎలాంటివో ఇక్కడ కొన్నింటిని తెలుసుకుందాం. ఈ హక్కులు నెరవేర్చకపోతే ఎవరి హక్కు అయితే నెరవేర్చబడలేదో అతను క్షమించనంతవరకు అల్లాహ్ కూడా అతన్ని క్షమించడు. ఇంకా ఈ హక్కులు ఎంత ముఖ్యమైనవి అంటే వాటి ప్రభావం మనిషి జీవితంపై అధికంగా ఉంటుంది. క్లుప్తంగా ఇవి మనం ప్రతిరోజూ మాట్లాడే మాటలు, ప్రతి రోజు చేసే కార్యాలు. మనిషి జీవితం అత్యంత సుందరంగా, ఆకర్షవంతంగా రూపుదిద్దుకుంటుంది. ఈ ప్రజల హక్కులు నెరవేర్చటానికి మనిషి కొన్ని నీతి నియమా లను కలిగి ఉండటం తప్పనిసరి.

మొట్టమొదటిది అతని నైతికత, అతని ప్రవర్తన. మనిషి నైతికతను కలిగి ఉంటే నిస్సందేహంగా అతని విశ్వాసం కూడా దృఢంగా ఉంటుంది. దీని కారణంగానే దైవప్రవక్త(స) మనిషి నైతికతను కలిగి ఉండటం అతను ఆచరించే అదనపు ఆరాధనల కంటే ఉత్తమమైనది అని బోధించారు.

ఇంకా అల్లాహ్ భయం మనిషి తన హృదయంలో కలిగి ఉండటం అత్యంతవసరం. ఈ భయం ద్వారా మనిషి ఎన్నో

పాపాల నుంచి సురక్షితంగా ఉంటాడు. ఉదాహరణకు మనిషి అల్లాహ్ భయాన్ని కలిగి ఉన్నట్లయితే అతను ఎన్నటికీ అసత్యం మాట్లాడడు. దైవప్రవక్త ముహమ్మద్(స) హజ్రత్ ఆయిషా(ర)ను ఉద్దేశించి "ఓ ఆయిషా! చిన్న చిన్న పాపాల నుంచి సురక్షితంగా ఉండు. వాటి గురించి కూడా అల్లాహ్‌కు సమాధానం ఇవ్వవలసి ఉంటుంది" అని బోధించారు. (ఇబ్నెమాజా)

ఇంకా అల్లాహ్‌పై నమ్మకం ఉంచడం కూడా నైతికతకు సంబంధించిన ఒక పెద్ద విషయమే. మనిషి తన జీవితానికి సంబంధించిన ప్రతి విషయంలో తన శక్తి మేరకు ఆలోచించి, తన శక్తిమేరకు కృషి చేసి ఇక పూర్తిగా అల్లాహ్‌పై నమ్మకముంచాలి. ఆ తరువాత ఏమి జరిగినా, ఎంత లభించినా అంతా అల్లాహ్ తరపు నుంచే జరిగిందని, లభించిందని తృప్తి పడాలి. ఎందుకంటే మనిషి సాఫల్యం కేవలం అతని కృషిపైనే ఆధారపడి ఉండదు. అలాగని కృషి చెయ్యకుండా చేతులు ముడుచుకుని కూర్చున్నా లభించదు. తన వంతు పూర్తి కృషి చేసి అల్లాహ్ సహాయం కోసం ఎదురు చూడాలి. ఈ నమ్మకం అనేది మనిషి అతని చుట్టూ ఉండే పశువులను, పక్షులను చూసి చక్కగా గ్రహించగలడు. అవి ఉదయం లేచి అల్లాహ్‌పై పూర్తి నమ్మకంతో తమ కడుపు నింపుకోవటానికి వెళతాయి. ఆ తరువాత కనబడే విషయమేమిటంటే ఖాళీ కడుపులతో బయలుదేరిన అవి నిండైన కడుపులతో తిరిగి తమ గూటికి చేరుకుంటాయి. వాటిని చూసిన వారికి దేవునిపై నమ్మకం తప్పకుండా అధికమవుతుంది.

ఇంకా మనిషి జీవితంలో సహన స్థైర్యాలను కలిగి ఉండటం కూడా చాలా అవసరం. ఎందుకంటే మనిషి దినచర్యలో భాగంగా ఎన్నో విషయాల గురించి రకరకాల మనుషులతో అతనికి సంబంధం ఏర్పడుతుంది. అలాంటప్పుడు ఇతరుల నోటి ద్వారా, పనుల ద్వారా ఎంతో కొంత బాధ కలగటం తప్పకుండా జరుగుతుంది. అటువంటప్పుడు సహనంతో ముందడుగులు వెయ్యవలసి ఉంటుంది. కనుక సాధారణంగా మదిలో కలిగే ప్రతీకార భావనను తొలగించాలి. మన్నింపుల వైఖరిని అవలంబించాలి. విశాల హృదయాన్ని కలిగి ఉండాలి. సంయమనాన్ని పాటించాలి. ఈ వైఖరి ప్రభావం ఇతరులపై ఆలస్యంగా పడినా వారి ధోరణి మారిపోతుంది. ఒండొకరి మధ్య ఉండవలసిన సంబంధాలు మెరుగు పడతాయి.

ఇంకా మనిషి జీవితం తన చుట్టూ ఉండే ప్రజలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి అతను ఎల్లప్పుడూ ప్రజల సమూహంలోనే ఉంటాడు. ప్రజల సమీపంలోనే ఉంటాడు. అటువంటప్పుడు వారి వస్తువులు, వారి మాటలు, వారి విషయాలు అన్నీ అతనికి సమీపమవుతుంటాయి. అతనికి తెలుస్తూ ఉంటాయి. కనుక మనిషిలో అమానతు అనే గుణం తప్పకుండా ఉండాలి. దీని కారణంగా ప్రజల ధనం, ప్రజల వస్తువులు, ప్రజల మాటలు సురక్షితంగా ఉంటాయి. అతని ఈ సురక్షిత గుణం ప్రజల హృదయాలలో అతని పట్ల గౌరవం, నమ్మకం ఇనుమడింప జేస్తాయి.

ఇంకా మనిషి ఈ ప్రపంచంలో పేరుప్రఖ్యాతులు పొందడం కోసం ఏ పనీ చెయ్యకూడదు. ఒకవేళ ఈ ఉద్దేశ్యంతో గనక ఏ కార్యాన్ని అయినా చేసినట్లయితే అందులో చిత్తశుద్ధి ఎంతమాత్రమూ ఉండదు. అందులో ఎలాంటి నాణ్యతా ఉండదు. ప్రజలు అతని ముందు అతన్ని పొగిడినా కేవలం అతనితో తమ పనులు చేయించుకోవటానికి తప్ప మరేమీ ఉండదు. పొగడ్తల కోసం చేసిన పని ద్వారా అతనికి ఎలాంటి ప్రతిఫలమూ లభించదు. కేవలం బూడిదలో పోసే పన్నీరుగా అయిపోతుంది. ఒకవేళ చిత్తశుద్ధితో చేసినట్లయితే ప్రజలు అతన్ని ఇష్టపడతారు. అల్లాహ్ కూడా ఎంతో ఇష్టపడతాడు. దాని ద్వారా అతని పనిలో నాణ్యత ఉంటుంది. దాని ద్వారా అతనికి ప్రశాంతత ప్రాప్తమవుతుంది. ప్రజలకు కూడా లాభం చేకూరుతుంది. అంతేకాదు, అతని వెనుకాల గోప్యంగా అతని పేరుప్రఖ్యాతులు ప్రజలలో మారుమ్రోగుతాయి. ఇంకా అతను ప్రజలకు ఒక ఆదర్శప్రాయం అవుతాడు.

ఇంకా మనిషి వృధా ఖర్చుకు, వృధా విషయాలకు దూరంగా ఉండాలి. వృధా ఖర్చు మనిషి ఎంతటి ధనవంతుడైనా ఒక రోజున అతనికి పేదరికానికి తప్పకుండా గురిచేస్తుంది. వృధా విషయాలు మనిషి సమయాన్ని హరించివేస్తాయి. ఇవి రెండూ ప్రజల మధ్యలో అతని వ్యక్తిత్వాన్ని కించపరుస్తాయి. మనిషి అవసరమైన ఖర్చులు చేసుకుంటూ అవసరమైన విషయాలతోనే గడిపినట్లయితే ప్రజల మధ్య తప్పకుండా సత్సంబంధాలు ఏర్పడతాయి.

చివరగా మనిషి అతనిపై హక్కు ఉన్న అతని సంబంధీకులు... తల్లీ, తండ్రి, భార్యాపిల్లలు, సోదర సోదరీమణుల హక్కులను నెరవేర్చకుండా దూరంగా ఉండటానికి ప్రయత్నించినట్లయితే అతని కుటుంబంలోనే అతని విలువ తగ్గుతూ వచ్చి చివరకు అతని విలువ ఏమీ లేకుండా పోతుంది. కాని ఒకవేళ తన స్థోమత మేరకు, తన శక్తిమేరకు వారి హక్కులు నెరవేర్చినట్లయితే బాధ్యత నెరవేర్చినందుకు అతనికి ప్రశాంతత లభిస్తుంది. అతని సంబంధీకులు కూడా సంతోషపడతారు. అల్లాహ్ కూడా సంతోషపడతాడు.

ఇవన్నీ మనిషి జీవితానికి సంబంధించినవి. వీటిని గనక బాధ్యతగా నెరవేర్చినట్లయితే అతని జీవితం సుఖశాంతులతో వర్ధిల్లటం తథ్యం.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

10 ప్రవక్తా, వీరికి చెప్పు, "మీరెప్పుడయినా ఆలోచించారా, ఈ వచనం అల్లాహ్ పక్షానే వచ్చి ఉండి, మీరు దీన్ని తిరస్కరించినట్లయితే (పరిణామం ఏమవుతుందో)? దీని మాదిరి ఒక వచనం పట్లనయితే బనీ ఇస్రాయీల్‌లోని ఒక సాక్షి సాక్ష్యమూ పలికి ఉన్నాడు. అతను విశ్వాసం గైకొన్నాడు. మీరేమో మీ పొగరులోనే పడి ఉండిపోయారు.[14] ఇటువంటి దుర్మార్గులకు అల్లాహ్ మార్గదర్శకత్వం చెయ్యనే చెయ్యడు."

**(14 వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఈ కారణంగానే ఇబ్ను అబ్బాస్, ముజాహిద్, కతాద, జహ్హాక్, ఇబ్ను సీరీన్, హసన్ బస్రీ, ఇబ్ను జైద్, ఔఫ్ బిన్ మాలిక్ అల్ అష్జయీ వంటి అనేకమంది ప్రముఖ వ్యాఖ్యాతలు ఈ వ్యాఖ్యానాన్ని స్వీకరించారు. కాని మరోవైపున ఇక్రిమ, షఅబీ, మస్రూక్ ప్రకారం ఈ ఆయత్ అబ్దుల్లా బిన్ సలామ్(ర)కు సంబంధించినది కాజాలదు. ఈ సూరా మొత్తం మక్కీ సూరాయే. ఇబ్ను జరీర్ కూడా ఈ మాటనే బలపరిచారు. ఆయన ప్రకారం, పై నుంచి వచన క్రమంలో మక్కా బహుదైవారాధకుల్ని సంబోధించడం జరుగుతూ వచ్చింది. ఆ తరువాత కూడా సంబోధన అంతా వారినే ఉద్దేశించింది. ఈ పూర్వాపరాలలో అకస్మాత్తుగా మదీనాలో అవతరించిన ఆయత్ రావడం ఊహాతీతంగా ఉంది. తరువాతి కాలంలో ఈ రెండవ వ్యాఖ్యానాన్ని స్వీకరించిన వ్యాఖ్యాతలు హజ్రత్ సఅద్ బిన్ అబీ వక్కాస్ ఉల్లేఖనాన్ని కాదనరు. వారి ప్రకారం, ఈ ఆయత్ హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (ర) విశ్వాసం గైకొన్న సందర్భానికీ అతుకుతుంది గనక హజ్రత్ సఅద్ ప్రాచీనుల పద్ధతి ప్రకారం, ఇది ఆయన విషయంలోనే అవతరించిందని అన్నారు. దీని భావం, ఆయన విశ్వాసం గైకొన్నప్పుడు ఆయన విషయంలోనే అవతరించిందని కాదు. దీని భావం కేవలం, ఆయన ఈ ఆయత్‌కు సరిగ్గా పోలి ఉన్నారు, ఆయన ఇస్లామ్ స్వీకారానికి పూర్తిగా అతుకుతుంది అన్నది మాత్రమే.

ఈ రెండవ అభిప్రాయమే ఇతోధికంగా సరయినదిగా, సమంజసమయినదిగా అనిపిస్తోంది. ఆ తరువాత, ఇక్కడ 'సాక్షి' అంటే ఎవరు అన్న ప్రశ్న అపరిష్కృతంగా ఉండిపోతుంది. ఈ రెండవ అభిప్రాయాన్ని అనుసరించినవారిలో కొందరు ఈయన మూసా (అ) అని అంటారు. కాని దాని తరువాతి వాక్యం, "అతను విశ్వాసం గైకొన్నాడు, మీరేమో మీ పొగరులోనే పడి ఉండి పోయారు" అన్నది ఈ వ్యాఖ్యానానికి సరిపడదు. చాలామటుకు సరయిన విషయం, వ్యాఖ్యాతలు నీషాపూరి, ఇబ్ను కసీర్ ప్రభృతులు చెప్పినదే అనిపిస్తోంది. ఇక్కడ సాక్షి అంటే ఎవరో ప్రత్యేక వ్యక్తి కాదు. బనీ ఇస్రాయీల్‌కు చెందిన సాధారణ వ్యక్తి అన్నమాట. దైవ వచనానికి భావమేమిటంటే, దివ్య ఖుర్ఆన్ ఏ బోధనలనయితే మీ ముందుంచుతున్నదో ఇవేవీ క్రొత్త విషయాలూ వింత విషయాలూ కావు, ఇవి ప్రపంచంలో తొలిసారిగా, మీ ముందే వచ్చిన విషయాలు కూడా కావు, మానవాళి మునుపెన్నడూ ఎరుగని ఈ విచిత్రమయిన విషయాలు ఎలా నమ్మేదీ అని మీరు వంకలు ప్రకటించడానికి. ఇంతకు ముందు కూడా ఇవే బోధనలు, ఇదేవిధంగా వహీ ద్వారా బనీ ఇస్రాయీల్ సమక్షంలో తౌరాత్ తదితర దైవగ్రంథాల రూపంలో వచ్చి ఉన్నాయి. వారిలోని ఒక సామాన్య వ్యక్తి వీటిని నమ్మి స్వీకరించాడు, అల్లాహ్ పంపే వహీ ఈ బోధనల అవతరణా మార్గమని కూడా అంగీకరించాడు. అందువల్ల ఈ వహీ, ఈ బోధనలు అవగతం కాని విషయాలని మీరనలేరు. అసలు విషయమేమిటంటే, మీ గర్వం, అహంకారం, నిరాధారమయిన నిక్కు విశ్వసించడానికి అడ్డుగా నిలుస్తున్నాయి. ✤

**సహీహ్ బుఖారీ** (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## ప్రవక్త మహనీయులు (సఅసమ్) అస్వస్థతకు గురైనప్పుడు

**295)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తన మరణ వ్యాధి సందర్భంగా మాటిమాటికీ ఇలా అనసాగారు: "ఫీ రఫీఖిల్ ఆలా" (ఓ అల్లాహ్! నన్ను నా ఉన్నత మిత్రుల వద్దకు- అంటే దైవప్రవక్తల, సిద్దీఖుల వద్దకు చేర్చు).

**296)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఆరోగ్యంగా ఉన్న కాలంలో ఇలా అనేవారు- "ఎప్పుడు ఏ దైవప్రవక్త ఆత్మను వశపరచుకున్నా, మొదట ఆయనకు స్వర్గంలో ఆయన నివాస స్థలాన్ని తప్పక చూపించబడేది. ఆ తరువాత ఆయనకు (ప్రపంచం కావాలో, పరలోకం కావాలో కోరుకొమ్మని) ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడేది"- మరి దైవప్రవక్త(స) అస్వస్థతకు గురై, మరణ ఘడియ సమీపించినప్పుడు ఆయన(స) తల నా తొడపై ఉంది. ఆయన స్పృహ తప్పిపోయారు. కొద్దిగా స్పృహలోకి వచ్చినప్పుడు ఆయన(స) కళ్ళు ఇంటి కప్పుపైకి చూస్తున్నాయి. ఆ క్షణంలో ఆయన(స) అధరాల మీదుగా జాలువారిన వాక్యం యిది: "అల్లాహుమ్మ రఫీఖిల్ ఆలా" (ఓ అల్లాహ్! నన్ను పరమోన్నత మిత్రులతో కలుపు). ఇక దైవప్రవక్త(స) ఈ ప్రాపంచిక జీవితాన్ని ఇష్టపడటం లేదన్న విషయం నాకు అర్థమయింది. ఆయన(స) ఆరోగ్యంగా ఉన్నప్పుడు చెప్పిన హదీసు ఆ క్షణంలో నాకు జ్ఞాపకం వచ్చింది.

**297)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: (నా సోదరుడు) అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బకర్(రజి) దైవ ప్రవక్త(సఅసమ్) సేవలో హాజరైనప్పుడు ప్రవక్త(స) నా ఎదకు ఆనుకుని ఉన్నారు. అబ్దుర్రహ్మాన్ చేతిలో ఉన్న పచ్చని మిస్వాక్ (పలుదోము పుల్ల)ను ఆయన(స) తదేకంగా చూస్తూ ఉండటంతో, నేను ఆ మిస్వాక్ పుల్లను అతని నుండి తీసుకుని, దానిని నా పల్లతో బాగా నమలి, పిదప దానిని బాగా శుభ్రపరచి ఆయన(స)కు ఇచ్చాను. ఆయన(స) ఆ మిస్వాక్‌ను ఎంత చక్కగా ఉపయోగించారంటే, అంతకుముందెన్నడూ ఆయన(స) అంత చక్కగా ఉపయోగించినట్లుగా నేను చూడలేదు. మిస్వాక్ చేయటం పూర్తయిన తరువాత ఆయన(స) తన చేతిని లేదా తన వ్రేలిని పైకెత్తి "ఫీ రఫీఖిల్ ఆలా" (పరమోన్నత మిత్రులలో కలుపు) అని మూడుసార్లు పలికారు. అంతే, ఆయన మహాప్రస్థానం చేశారు. ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స) తనువు చాలించినప్పుడు ఆయన(స) శిరస్సు నా కంఠాభరణానికీ, నా చుబుకానికీ మధ్యన ఉంది.'

**298)** హజ్రత్ ఆయిషా సిద్దీఖా(ర.అ) తనకు తెలియజేసినట్లుగా ఉర్వా బిన్ జుబైర్ చెప్పారు : దైవప్రవక్త(సఅసమ్) ఎప్పుడయినా అస్వస్థతకు గురైనప్పుడు 'ముఅవ్వజాత్' (సూరయె ఇఖ్లాస్, సూరయె ఫలఖ్, సూరయె నాస్) పఠించి, తన చేతులపై ఊది వాటిని తన శరీరంపై స్పర్శించేవారు. మరి ఆయన(స) మరణ వ్యాధికి గురైనప్పుడు నేనే ఆ సూరాలను పఠించే దానిని. పిదప ఆయన చేతులను ఆయన(స) శరీరంపై త్రిప్పేదానిని.




**విశ్వాసులారా! దేవునికి భయపడండి. ప్రతి మనిషీ రేపటి కోసం తాను ఏం సంపాదించి సిద్ధపరచుకున్నాడో యోచించాలి. (కనుక) దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. మీరు చేస్తున్న పనులన్నీ దేవునికి తెలుసు. మీరు దేవుణ్ని మరచినవారిలా మారకండి. వారు దేవుణ్ని మరచిపోయినప్పుడు, దేవుడు వారిని తమనుతామే మరచి పోయినట్లు చేశాడు. అలాంటివారే దుర్జనులు. నరకానికి పోయేవారు, స్వర్గానికి పోయే వారు ఎన్నటికీ ఒకటి కాజాలరు. స్వర్గానికి పోయేవారే సఫలీకృతులు. (అల్-హష్ర్: 18,19)**

మనం యుద్ధ వాతావరణం నుండి బయట పడి, జుల్ హిజ్జా మాసానికి వీడ్కోలు పలికి, అల్లాహ్ మాసమైన ముహర్రం మాసపు పవిత్ర వాతావరణంలో శ్వాస పీల్చుకుంటున్నాము. నూతన సంవత్సరపు ఆరంభ ఘడియలలో ప్రతి విశ్వాసి తాను ఆశించిన కొత్తదనం కోసం ఎదురు చూస్తున్న శుభ తరుణంలో తౌహీద్‌కి కట్టుబడి జీవిస్తానన్న శుభ సంకల్పంతోపాటు ప్రవక్త పితా మహులైన హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) వంటి అచంచల విశ్వాసం అల్లాహ్ యెడల కలిగి ఉండాలి.

ఒక్క విశ్వప్రభువు తప్ప (మిథ్యా దైవాలన్నీ) ఇవన్నీ నాకు శత్రువులు. విశ్వప్రభువు - ఆయనే నన్నుసృష్టించాడు. ఆయనే నాకు (రుజు)మార్గం చూపించాడు. నాకు ఆహారపానీయాలు ఆయనే ప్రసాదిస్తున్నాడు. నేను జబ్బుపడితే స్వస్థత చేకూర్చేవాడు ఆయనే, నాకు మరణం కలిగించేవాడు ఆయనే, (పరలోకంలో) నన్ను పునర్జీవింపజేసేవాడు కూడా ఆ ప్రభువే. ఆయన తీర్పుదినాన నా పాపాలు క్షమిస్తాడని ఆశిస్తున్నాను" అన్నారు ఇబ్రాహీం. (అష్-షుఅరా: 75-82)అన్న శక్తివంతమైన మాటను జ్ఞాపకం చేసుకుంటూ భక్తి నిండిన హృదయంతో, కృతజ్ఞతా భావంతో, సమర్పణ గల స్వభావంతో అల్లాహ్ పవిత్ర సన్నిధిలో మోకరిల్లి, అల్లాహ్ చిత్తానుసారం ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) చేసిన ప్రార్థనను మనమూ తప్పక చేయాలి.

(ఆ తర్వాత అతనిలా ప్రార్థించాడు:) "ప్రభూ! నాకు విద్యా వివేకాలు ప్రసాదించు. నన్ను సజ్జనులలో చేర్చు. భావితరాలలో నాకు సత్కీర్తి ప్రసాదించు. మహాభాగ్యాలతో నిండిన స్వర్గానికి వారసులయ్యేవారి జాబితాలో నన్ను చేర్చు. నాతండ్రిని క్షమించు. ఆయన దారి తప్పాడు. మానవులు మళ్లీ బ్రతికించి లేపబడే రోజున నన్ను నవ్వులపాలు చేయకు. ఆ రోజు సంతానం, సిరిసంపదలు ఏ మాత్రం ఉపయోగపడవు. నిష్కల్మషమైన హృదయంతో దేవుని సన్నిధికి వచ్చినవారికే ఆ రోజు ప్రయోజనం ఉంటుంది." (అష్-షుఅరా: 83-89)

కరుణ, కనికరం ఆభరణాలుగా, విజ్ఞానం, సంస్కారం సంపదలుగా, సాధన, ప్రయత్నం ప్రణాళికలుగా నమ్మకం, విశ్వాసం వ్యక్తిత్వంగా, కొనసాగించే జీవితం సదా శాంతిమయం.

ధర్మం నాలుగు పాదాలపైన నడిచిన ప్రవక్తల యుగంలో సైతం, నమ్రూద్, ఫిరౌను, హామాను, అబూ జహాల్, అబూ లహబ్

వంటి దుష్టులు, దుర్మార్గులు, స్వార్థపరులు ఉన్నారంటే ధర్మం ఒక్క పాదం మీద కుంటుతూ నడుస్తున్న ఈ యుగాన్ని గురించి చెప్పేదేముంది? కానీ యుగాలు మారినా, ప్రపంచంలో ఇంకా మనగలిగే పరిస్థితులకు కారణం అల్లాహ్ కృపానుగ్రహం. తర్వాత మానవాళి గురించి ఆలోచించే అద్భుత వ్యక్తుల అంతరంగ బలం. వారి బోధనలతో, వారి మార్గదర్శకత్వంలో నడిచి సొంత లాభం మానుకున్న మహనీయుల వల్లే. ఎంత కాదనుకున్నా, అది కుటుంబం ఇచ్చిన బలమే! ఆలంబనే!! పెంపకంలోని సంస్కారమే!!! ఈ శుభ సందర్భంగా కొన్ని విషయాల్ని నెమరు వేసుకుందాం!

## సమయపాలన

అనంతమైన కాలవాహినిలో ఒక నిర్దిష్ట భాగాన్నే 'సమయం' అంటారు. అది క్షణాలు, నిమిషాలు, గంటలు, రోజులు- ఏదైనా కావచ్చు. మనిషి ప్రతి చర్యను సమయం శాసిస్తుంది. ఏ సమయంలో ఏమి చెయ్యాలో ముందే నిర్దేశితమై ఉంటుంది. మనిషి క్రియలన్నీ దైవాభీష్టానికి, ధర్మానికి అనుసంధానమై ఉన్నంతకాలం సర్వత్రా సత్ఫలితాలే లభిస్తాయి. ధర్మానికి వ్యతిరేకంగా ఏది చేసినా విరుద్ధ ఫలితాలే ఉంటాయి. "నేనే కాలాన్ని చేసినవాడను. మీరు కాలాన్ని తిట్టకండి" అని స్వయంగా అల్లాహ్ సెలవిస్తున్నాడు అంటే కాలం ఎంత విలువైనదో తెలుస్తుంది. ఈ విశిష్టతల కారణంగానే అల్లాహ్ కాలాన్ని ప్రమాణంగా తీసుకున్నాడు:

కాలచక్రం సాక్షి! మానవుడు ఘోరంగా నష్టపోయాడు. అయితే సత్యాన్ని విశ్వసించి (తదనుగుణంగా) సత్కార్యాలు చేస్తూ, సత్యం, సహనాలను గురించి పరస్పరం ఉపదేశించుకునేవారు మటుకు ఏమాతం నష్టపోరు. (అల్-అస్ర్: 1-3) కండ బలం కన్నా ఆత్మ బలం గొప్పది- ఆయుధ సమరం కన్నా అక్షర సమరం గొప్పది. అహంకారం కన్నా ఆత్మాభిమానం గొప్పది - ఔపోసన (అధ్యయనం)కన్నా అనుభవం గొప్పది - శాస్త్ర పఠనం కన్నా సంస్కార ఔన్నత్యం గొప్పది - సహన శక్తి, సమతుల్యత సదా అభిలషణీయం.

మనం సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటామనే దానిని బట్టి మన జయాపజయాలు, సుఖ సంతోషాలు, కష్టాలు బాధలు ఆధారపడి ఉంటాయి. కాబట్టి సంతోషంగా ఉండాలంటే సమయ పాలన తప్పనిసరి. వేళకు నమాజు చేయడం, సమయానికి తినడం, సమయానికి నిద్రపోవడం, సమయానికి ఆఫీసుకు వెళ్లడం, సమయం ప్రకారం ఆయా పనులు చేసుకోవడం వంటివి మనలో ఒత్తిడిని దూరం చేస్తాయి. ఆత్మ విశ్వాసాన్ని నింపుతాయి. విజయానికి కారణం అవుతాయి. కాబట్టి గతం ఎలాగూ గడిచిపోయింది. ఈ కొత్త సంవత్సరం రోజు నుంచైనా ఖచ్చితమైన సమయ పాలనను పాటించాలి. అరబీలో ఓ సామెత ఉంది: సమయం కరవాలం లాంటింది, దాన్ని నువ్వు సద్వినియోగ పరచుకోకపోతే అది నిన్నే సంహరిస్తుంది.

విజ్ఞానం ఎంత ముఖ్యమో విచక్షణ అంతకంటే ముఖ్యం, విజ్ఞానం మనల్ని మేధావిని చేస్తే విచక్షణ వివేకవంతుడిని చేస్తుంది. విచక్షణ లేని విజ్ఞానం కథకుడు లేనికథ లాంటిది, రెండూ కలిసిన వ్యక్తిత్వం విలువలతో కూడిన విచక్షణా జ్ఞానం ప్రసాదిస్తుంది.

## రెండు మహా భాగ్యాలు - ఆరోగ్యం, తీరిక సమయం

ఒకవేళ మీరు కొద్ది కాలం అనారోగ్యంతో ఉన్నా కూడా మీకు ఆరోగ్యం విలువ ఏంటో అర్థమైయ్యుంటుంది. ఆరోగ్యంగా లేకపోతే ఇల్లు, కుటుంబం, వ్యాపారం, సంపద ఇవన్నీ ఉన్నా లేనట్టే.. అన్నీ తెలిసీ.. సరైన సమయానికి తినక.. ఏదో ఒకటి.. ఎప్పుడో ఒకప్పుడు.. ఎలానో ఒకలా తినేసి చేతులారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నావురా.. అని పెద్దలు అంటుంటారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉండాలంటే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఒక దేశ అభివృద్ధికి, సమాజ ఆరోగ్యానికి ఆ దేశ ప్రజల ఆయుర్దాయమే కొలమానం. 'జీవితం ఒక ప్రవాహం. అదెప్పుడూ ముందుకే సాగాలి, వెనుకకు కాదు'. 'వికసిత్ భారత్' అని నినాదాలిస్తున్నా ప్రజల ఆయుష్షు మాత్రం వెనకడుగు వేస్తోంది. భారతదేశంలో ప్రజల ఆయుర్దాయం తగ్గినట్లు ఇటీవల వెలువడిన గణాంకాలు ఒకింత ఆందోళనకరమైనవే.

'జీవితం ఓ ప్రయాణం అయితే, ఆయుష్షు దానికి ఇంధనం. అది క్షీణిస్తే.. మన గమ్యం ఆగిపోతుంది. పౌష్టికాహారం, కాలుష్య రహిత వాతావరణం, రక్షిత మంచినీరు, వైద్య, ఆరోగ్య సౌకర్యాలు, మానసిక ప్రశాంతత వంటి అనేక కారణాలు ఆయుఃప్రమాణాల మెరుగుదలకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు.

'ప్రతి మార్పు ఒక చిన్న అడుగుతో ప్రారంభమౌతుంది' అంటారు. ప్రజా సంక్షేమానికి తిలోదకాలిచ్చి కార్పొరేట్ల సేవలో తరిస్తున్న ప్రభుత్వాలకు, గణాంకాల వెనుక గోచరిస్తున్న ఈ హెచ్చరిక ఓ గుణపాఠం కావాలి. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. 'ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే, భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడమే. 'డబ్బుకు లేదే సిగ్గు, ఎగ్గు, న్యాయం. అదుంటే ఏ పనైనా ఖాయం'

నిజాన్ని నిలువునా పాతేయాలని, తిమ్మిని బమ్మిని చేసెయ్యాలని పాలక వర్గాలు భావిస్తుంటాయి. కానీ, వాస్తవాలు ఎప్పుడో ఒకప్పుడు పాతాళం నుంచైనా బయటకు వచ్చి నాటి తప్పులకు వారిని బోనులో నిలబెడుతుంటాయి.

### తీరిక సమయంలో స్క్రీన్ టైమ్ తగ్గించండి

స్మార్ట్ఫోన్ జీవితంలో ఒక భాగమైపోయింది. ఇంట్లో ఉన్నా, ఆఫీసుకు వెళ్లినా, మీటింగ్లో ఉన్నా, ఇతరులతో మాట్లాడుతున్నా దానిని చెక్ చేయకుండా చాలా మంది ఉండలేకపోతున్నారు. దీంతోపాటు ఎప్పుడు చూసినా కూడా ఫోన్, ట్యాబ్, కంప్యూటర్ లేదా టీవీ చూస్తూ గంటలు గంటలు గడిపితే అదొక వ్యసనంగా మారుతుంది. ప్రస్తుతం చాలా మందిలో కళ్ల సమస్యలు, తలనొప్పి, మైగ్రేన్ వంటి వాటికి ఇది కూడా కారణం అవుతోంది మమకారంతో కూడిన ప్రేమ తరంగాలు బంధాలకు ఎంత స్వచ్ఛమో, కడదాకా కలిసుండే స్నేహ తరంగాలు మనసుకు ఎంత ముఖ్యమో, పడి లేచే కడలి తరంగాలు సముద్రానికి ఎంత అందమో, తారతమ్యాలు లేని అంతరంగాలు మన జీవన తరంగాలకి అంతే ముఖ్యం. అహంతో మాట్లాడే మాటలు మనసును బాధిస్తాయి. ప్రేమతో మాట్లాడే మాటలు మనిషిని చేరతీస్తాయి అజ్ఞానంతో కూడిన మాటలు మనిషిని కృంగతీస్తాయి. ఆప్యాయతతో అలరించే మాటలు మనిషికి ఆత్మీయతను పంచుతాయి. మాటలో సంయమనం పాటిస్తే మనిషి గౌరవం పెరుగుతుంది. అలాంటి ఆప్యాయతతో అలరించే నాలుగు మాటలు- అమ్మానాన్నలతో, అక్కాచెల్లెళ్ళతో, అన్నదమ్ముల్లతో, కొడుకు కూతుళ్లతో, భార్య బంధువులతో మాట్లాడే తీరిక నేడు మనకు లేకుండా పోతోంది. ఇది చాలా ప్రమాదకరం!

**(మిగతా వచ్చేవారం)**

## క్వాలిటీ టైమ్



నూతన ఆవిష్కరణలకు కారణ'భూతమైన' టెక్నాలజీని ఎక్కువగా ఉపయోగించే కాలంలో, కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు కలిసి గడిపే గుణాత్మక సమయం (క్వాలిటీ టైమ్) తగ్గిపోతుంది. ఇది చాలా క్లిష్టమైన సమస్య.

కుటుంబ పెద్దగా మనం మన కుటుంబాన్ని ప్రేమిస్తాం. బిజీగా ఉండటం వల్ల సభ్యులతో ముఖ్యంగా పిల్లలతో, వృద్ధులతో ఎక్కువ సమయం గడిపే అవకాశమే దొరకదు (రాదు). కనుక, క్వాలిటీ టైమ్ గురించి తరచుగా బాధపడుతూ ఉంటాం. ప్రస్తుత ఉరుకులు, పరుగుల హడావిడి పెరిగిపోయిన జీవన విధానంలో ఏ పనికీ సరిగ్గా సమయం చాలడం లేదు. అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరాటపడటం సహజం. అందుకు కొన్ని సూత్రాలు తెలుసుకుందాం!

మనం చేసే పనిలో క్వాలిటీ ఉందా? లేదా? నిర్ణయించుకునేందుకు ముచ్చటగా మూడు ప్రశ్నలు వేసుకోవాలి.

1) మనం పాల్గొనే కార్యక్రమం కుటుంబ సభ్యులందరూ పాల్గొనేదా కాదా?

2) అది మన పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంచే విధంగాను, కుటుంబాన్ని సన్నిహితం చేసేదిగా ఉందా? లేదా?

3) మనకు ఆనందం, సంతృప్తి కలిగిస్తుందా? లేదా? వీటికి 'అవును' అనే సమాధానాలు వస్తే మీ సమయం సద్వినియోగం అయినట్లే.

నిజానికి మనం చేయాల్సిన ముఖ్యమైన పని– పని ఒత్తిడిని తగ్గించుకుని పిల్లలతో (వృద్ధులతో) మరింత సమయం గడపటం. కొన్నిసార్లు వారి పక్కనే మనం ఉన్నాం అన్న తృప్తే వారికి చాలు. ఎక్కువ సమయం పిల్లలతో, వృద్ధులతో గడపడం వల్ల దానిని గుణాత్మకంగా మార్చుకునే అవకాశం కలుగుతుంది.

ఖుర్ఆన్లో వృద్ధులైన తల్లిదండ్రులు ఉంటే వారి ముందు 'ఉఫ్' అని కూడా అనవద్దు. వారితో వినమ్రులై విధేయతతో మెలగమని ఉండటం గమనించినట్లయితే మనకున్న సమయంలో కొంత భాగం వారితో గడపాలని తెలుస్తుంది. ఒకసారి ఆలోచించండి.

**- మంగళగిరి జీలాని**

# కుటుంబ పోషణ కూడా పుణ్యకార్యమే!

ప్రతి భర్త తన భార్యా పిల్లలకు తగిన రీతిలో అన్న వస్త్రాలను సమకూర్చి పోషించాల్సి ఉంటుందని దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు. మనిషి చేసే ఖర్చులో తన భార్య నోటికి అందించే ముద్ద అత్యంత పుణ్యప్రదమైందని ప్రవక్త మహనీయులు (స) బోధించారు. అధిక ఆదాయం కలవారు భార్యా పిల్లల పోషణ తర్వాత మిగిలిన మొత్తం నుంచి జకాత్ (దానం) ఇవ్వాల్సి ఉంటుంది. భార్యా పిల్లలను పోషించడం పురుషుని విధి. తల్లిదండ్రులు కడుపు తీపితోనే సంతానంపై ఖర్చు పెట్టినా..దానికి దేవుడు ఎంతో పుణ్యాన్ని ప్రసాదిస్తాడు. ఆలు బిడ్డల పోషణలో నిర్లక్ష్యం వహించడం మహా పాపం. మన ఖాతాలో ఇదొక్క పాపమే ఉన్నా ప్రళయ దినాన దేవుడు మనల్ని అందుకు కఠినంగా శిక్షిస్తాడు. 'ఇచ్చే చెయ్యి పుచ్చుకొనే చెయ్యి కన్నా శ్రేష్ఠమైనది. నీ సంపాదనలో మొదట నీపై ఆధారపడి ఉన్నవారిపై ఖర్చు పెట్టు. వారి అవసరాలన్నీ తీరిపోయాక చేసే దానమే అత్యుత్తమ దానం' అని దైవప్రవక్త(స) ఉద్బోధించారు. పురుషుడికి (భర్తకు) సహజంగా తన కుటుంబంపై ఉన్న ప్రేమానురాగాల వల్ల భార్యా పిల్లలను పోషించడానికి కష్టపడతాడు. వారి అవసరాలను తీరుస్తాడు. దానివల్ల వారు సుఖంగా ఉంటారు. అది చూసి అతడు సంతోషిస్తాడు. కుటుంబ సభ్యులు కూడా అతడి పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు మరింత ఎక్కువ చూపిస్తారు. అయితే కుటుంబ పోషణను దైవాజ్ఞ మేరకే చేస్తే అది ఆరాధనగా మారిపోతుంది. దాంతో ఆ ఆరాధనకు అతడికి పుణ్యం లభిస్తుంది! మీరు అత్యంత ప్రీతికరమైన వస్తువులను దైవ మార్గంలో ఖర్చు చేయనంత వరకు సత్కార్య స్థాయికి చేరుకోలేరని ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు. మన బంధువుల్లో నిరుపేదలు, అభాగ్యులుంటే మనం దానధర్మాలు చేసేటప్పుడు వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ మొదట కుటుంబ పోషణకే ప్రాధాన్యం ఇవ్వాలి.

**- అర్షియా**

# మస్జిదు మళ్ళీ అభివృద్ధికి కేంద్రం అవ్వాలి

ఇస్లాం ప్రకారం మస్జిదు కేవలం ప్రార్థనా స్థలం మాత్రమే కాదు.. అదొక జాతి ఆధ్యాత్మిక, మానసిక, సామాజిక, రాజకీయ శిక్షణల కేంద్రం. అందుకే ఆనాడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లం మదీనాకు హిజ్రత్ చేసిన తర్వాత మస్జిదు నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు. మంచి సమాజ నిర్మాణం కోసం, ప్రజల అవసరాలు తీర్చడానికి, ఉమ్మత్ (ముస్లిం సమాజం) బాధలకు పరిష్కారాలు సూచించే సజీవ కేంద్రాలుగా ఆనాడు మస్జిదులు వెలుగులీనాయి. ముస్లిమేతరులు కూడా ఆనాడు సమస్యల పరిష్కారం కోసం మస్జిదులకు వచ్చేవారు. నేడు మస్జిదులకు ఆ పూర్వ వైభవాన్ని తీసుకురావాలి. మస్జిదులను కేవలం నమాజ్‌కు పరిమితం చేయకుండా, మళ్లీ సమాజంలోని అన్ని రంగాల అభివృద్ధికి కేంద్రాలుగా మలచాలి. ఆధ్యాత్మికత నిలయంగానే కాకుండా సామాజిక శక్తి, సాంస్కృతిక చైతన్యం మస్జిదుల ద్వారా పెరిగేలా చూడాలి. నేడు ఉమ్మత్ ముందున్న పెద్ద సవాళ్లలో ఇది ప్రధానమైనది. దీనికి వ్యూహాత్మక దీర్ఘ కాలిక ప్రణాళిక అవసరం. మరోవైపు మహిళలు మసీదులకు వెళ్లాలా వద్దా అనే నిర్ణయాధికారాన్ని వారికే వదిలేయాలి. మహిళలు మస్జిదులకు వెళ్లడానికి ప్రవక్త అనుమతించారు. వారు మస్జిదులకు వెళ్లకూడదని ఖురాన్‌లోనూ ఎక్కడా ప్రస్తావించలేదు. మహిళలను మస్జిదులకు వెళుతుంటే ఆపొద్దని.. రాత్రి వేళల్లోనూ వారిని మస్జిదుల్లోకి అనుమతించాలని ఓ హదీసు చెప్తోంది. నేటి చురుకైన ఆధునిక కాలపు మహిళలను మస్జిదుల నుంచి దూరంగా ఉంచితే లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుంది. వారిని పిల్లలతో సహా మస్జిదులోనికి రావడానికి అనుమతి ఇవ్వాలి. అయితే మహిళలు వినయంతో, ధార్మిక చింతనతో మస్జిదుల్లో ప్రార్థనలు చేయాలని ఖుర్ ఆన్ బోధిస్తున్నది. ఈ నేపథ్యంలో మస్జిదుల్లో మహిళలు ప్రార్థనలు చేసేందుకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

**- షేక్ హసన్**

హుమేరా అమీర్, ఏలూరు

# ఇస్లామ్‌లో క్షమాపణకు ఉన్న ప్రాధాన్యత

గత సంచిక తరువాయి

**మన తోటి మానవులు మనల్ని ఎంత బాధపెట్టినా, వారిని క్షమించాలని అల్లాహ్ ఖురాన్లో ఆజ్ఞాపిస్తున్నాడు. "మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ, సహాయం చేయకూడదని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి, వారి (తప్పులను)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. (దివ్య ఖుర్ ఆన్ 24:22).**

మనిషి వల్ల మరొక మనిషికి ఎంత తీవ్రమైన అన్యాయం, అవమానాలు జరిగినప్పటికీ, తప్పు చేసిన వారిని క్షమించమనే ఇస్లాం బోధిస్తుంది. మనిషిలోని ఎంత సున్నితమైన భావానికి దెబ్బ తగిలినా ప్రతీకార వాంఛను పక్కనపెట్టి ఔదర్యాన్నే ప్రదర్శించాలని అల్లాహ్ బోధిస్తున్నాడు. మనిషి ఎన్ని తప్పులు చేసినప్పటికీ అల్లాహ్ ఏ విధంగా క్షమిస్తున్నాడో అదే విధంగా మనిషి కూడా తోటి మనిషిని క్షమించాలని అల్లాహ్ ఈ ఆయత్ ద్వారా బోధించాడు. అల్లాహ్ క్షమాపణను మనిషి తానూ బ్రతికి ఉండగానే అర్థిస్తున్నాడు. పరలోకంలో కూడా తన తప్పులను దైవం పట్ట కూడదని బ్రతికి ఉండగానే అడిగేస్తున్నాడు. అటువంటప్పుడు తోటి మనిషి విషయంలో కూడా ఇదే క్షమాపణ భావాన్ని కలిగి ఉండాలని అల్లాహ్ బోధిస్తున్నాడు.

ఇస్లాంలో "క్షమాపణ" అనే అస్త్రాన్ని ఉపయోగించి విశ్వాసులు 'అల్లాహ్ నుండి క్షమాపణ కోరడం', 'ఇతరులను క్షమించడం' అనే చర్యల ద్వారా ఆధ్యాత్మిక పురోగతి , సామాజిక శ్రేయస్సు అనే రెండింటి విషయంలో పరివర్తన ప్రభావాన్ని కలిగి ఉంటారనేది నిర్వివాదాంశం.

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఏనాడూ తనను బాధపెట్టినవారిపై పగ, ప్రతీకారాలు పెంచుకోలేదు. ఈ విషయం మనకు ఎన్నోసార్లు స్పష్టంగా కనిపించింది. కూఫా వారి విషయంలో కావచ్చు, మక్కా విజయం తర్వాత కావచ్చు, ఎప్పుడైనా సరే ఆయన (స) సహనం క్షమాపణ అనే భావాల్నే వ్యక్తం చేశారు తప్ప ఏరోజూ ప్రతీకార జ్వాలల్లో రగిలిపోలేదు. చివరికి దైవ దూతలే స్వయంగా వచ్చి ప్రతీకారం తీర్చుకుంటాము, ఆజ్ఞాపించమని అడిగినా కూడా ప్రవక్త (స) తన సహనాన్ని, క్షమాగుణాన్ని విడిచిపెట్టలేదు. దైవ ధర్మ సంస్థాపనే ఆయన తన విధి అనుకున్నారు కానీ తన వ్యక్తిగత కారణాలు ఏరోజూ గుర్తుచేసుకోలేదు. అందుకు ప్రతిగా క్షమాపణ ద్వారా అల్లాహ్ ధర్మాన్ని ప్రపంచంలో విస్తరించి చూపించారు ప్రవక్త (స) వారు.

ఇస్లాంలోకి రావడం కారణంగా అత్యంత దారుణంగా మొట్ట మొదట షహీద్ కాబడిన బానిస మహిళ హజ్రత్ సుమయ్యా(ర) గారు కావచ్చు, అమ్మార్ (ర), యాసిర్ (ర) బిలాల్ (ర) మొదలైన వారు ఎవరైనా కావచ్చు, కేవలం నిజదైవాన్ని విశ్వసించిన కారణంగా వారు ఎన్నో బాధలు అనుభవించారు. వీరందరికీ దైవం మీద భారం వేసి సహనం వహించమని దైవ ప్రవక్త ముహమ్మద్ (స) నేర్పించారే తప్ప వీరెవరికీ కూడా ఆయన ప్రతీకార భావనను నేర్పలేదు. ఈ రోజు మనం అనుభవించే

బాధలు, కష్టాలు ప్రవక్త (స) గారు కానీ, ఆయన సహాబా (ర) మొదలైన వారు అనుభవించిన కష్టాలతో పోలిస్తే వారి కష్టాలు, వారి ఉత్తమ ఆచరణల ఛాయల్లో కూడా మనం లేము. అయినా కూడా మనలో ఓర్పు, సహనం, క్షమాపణ అనే గుణాలు గుండు సున్నాలుగా మారిపోతున్నాయి.

"అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారికొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవాడు, ఎంతో ఘోరమైన అబద్ధాన్ని కల్పించాడు అన్నమాట, ఎంతో తీవ్రమైన పాపపుమాట అన్నాడు అన్నమాట" (దివ్య ఖుర్ ఆన్ 4:48).

తనను సృష్టించిన దైవానికి సాటి కల్పించడం అనే పాపం కంటే పెద్ద పాపం ఈ ప్రపంచంలోనే లేదు. అటువంటి ఘోరాతి ఘోరమైన షిర్క్‌ను పరలోకంలో క్షమించను అని అల్లాహ్ చెపుతున్నప్పటికీ అదే షిర్క్‌కు ఇహలోకంలోనే మనిషి క్షమాపణ చెప్పుకున్నప్పుడు ఆ వ్యక్తిని క్షమించడంతోపాటు ఆ వ్యక్తి తాను పాపక్షమాపణ కోసం దైవానికి లొంగిపోయే సమయం వరకు తన జీవిత పర్యంతం చేసిన అన్నిరకాల తప్పులను, పాపాలను క్షమించి, రెట్టింపు పుణ్యాలతో స్వర్గ వాగ్దానాన్ని కూడా చేశాడు అల్లాహ్. మనిషి చేసే ఎటువంటి తప్పులు అయినా దైవానికి సాటి కల్పించడం అనే పాపం కంటే చిన్నవే అవుతాయి.

కాబట్టి సముద్రంలో నురుగులా, పర్వతాల మాదిరిగా మనిషి పాపాలు ఉన్నప్పటికీ దైవమే వారిని క్షమిస్తున్నప్పుడు ఒక మనిషి సాటి మనిషి పై పెంచుకుంటే అటువంటి చర్యలకు తీర్పుదినం రోజు దైవానికి మనిషి ఏ విధంగా సమాధానం చెప్పగలడు? అటువంటి పగలు, ప్రతీకారాలు మనిషిని గానీ, దైవాన్ని గానీ ఏ విధంగా సంతృప్తి పరుస్తాయి? ప్రతీకారం మనిషిని పాపకార్యాల నుండి విడిపించదు. కేవలం అల్లాహ్ మనిషికి ప్రసాదించిన "క్షమాపణ" మాత్రమే మనిషిని పాపకార్యాలు చేయకుండా నిరోధించగలదు. మనిషికి మనిషి శత్రువుగా మారకుండా ఆపగలదు. రేపు తీర్పుదినాన దైవం ముందు నిలబడి సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం లేకుండా చేయగలదు. క్షమాపణ అనే భావాన్ని అవలంభించినందుకు గాను అదనంగా దైవం నుండి ప్రతిఫలం కూడా పొందగలం.

"బాగా తెలుసుకోండి, ఈ లౌకిక జీవితం ఒక ఆట, ఒక వినోదం, బాహ్య పటాటోపం, పరస్పరం ప్రగల్భాలు పలకటం, సంపద, సంతానాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందటానికి ప్రయత్నించటం తప్ప మరేమీ కాదు. దాని దృష్టాంతం ఇలా ఉంది: ఒక వర్షం కురిసింది. అప్పుడు దాని వల్ల మొలకెత్తి పెరిగిన చెట్లూ చేమలను చూచి, రైతులు సంబరపడ్డారు. తరువాత, అవే పండుతాయి. ఆ తరువాత అవి పసుపుపచ్చగా మారిపోవటాన్ని నీవు చూస్తావు. ఆపై అవి ఎండిపోయి పొట్టుగా మారిపోతాయి. దీనికి భిన్నంగా, పరలోకం ఇలా ఉంటుంది: అక్కడ తీవ్రమైన శిక్ష ఉంటుంది, అల్లాహ్ క్షమాభిక్ష, ఆయన ప్రసన్నత ఉంటాయి. ప్రాపంచిక జీవితం ఒక మాయా తడిక తప్ప మరేమీ కాదు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు పరుగెత్తండి, ఒకరికంటే ఒకరు ముందుకుపోయే కృషి చేయండి. ఆకాశాలంత, భూమి యంత విశాలమైన స్వర్గం వైపునకు పరుగెత్తండి. అది అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలనూ విశ్వసించిన వారి కొరకు సిద్ధం చేయబడింది. ఇది అల్లాహ్ అనుగ్రహం; తాను కోరిన వారికి ఆయన దానిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఎంతో అనుగ్రహం కలవాడు". (దివ్య ఖుర్‌ఆన్ 57: 20, 21)

ప్రాపంచిక జీవితం కేవలం 3, 4 నెలల్లో పంట పండి, తర్వాత ఎండిపోయే పంట వంటిది. పొలంలోని పంట ఎంత తొందరగా పండుతుందో, కళ్ళకు ఆహ్లాదాన్ని కలిగిస్తుందో, అంతకంటే తొందరగా ఎండిపోతుంది, ముగిసిపోతుంది. క్షమాపణ, తద్వారా దైవప్రసన్నత అనేవి కేవలం ఇహపరలోకాల విజేతల కోసం మాత్రమే ఉద్దేశించిన గుణాలు. అందువల్ల వారు మాత్రమే గుర్తిస్తారు ఇహలోకం తొందరగా ముగిసిపోయేది, నాశనమయ్యేది అని. మిగిలినవారికి ఈ ప్రపంచం మాయాప్రపంచం. అందువల్లే వారు పగా, ప్రతీకారాలనేవి జీవిత లక్ష్యాలుగా ఎంచుకుంటారు. ప్రభువు క్షమాభిక్ష దొరకనిదే ఎట్టిపరిస్థితిలోనూ స్వర్గం లభించదు. కాబట్టి సాఫల్యంకోసం ఒకరితో ఒకరు పోటీ పడి పరుగెత్తాలి, అంతేకానీ నరకంలో పోయి పడేందుకు కాదు.

ప్రవక్త ముహమ్మద్ (స) తన బోధనలలోను, తన ఆచరణలోనూ క్షమాపణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. స్వయంగా ఆయన(స) ఆచరించి చూపించి, ఆ తర్వాత బోధించారు. ఆయన (స) తన శత్రువులతోను, ద్రోహులతోను, తనకు అన్యాయం చేసిన వారి పట్ల కూడా నిరంతరం క్షమాపణను ప్రదర్శించారు. క్షమాపణ అనే గుణానికి ఒక రోల్ మోడల్‌గా నిలబడ్డారు. క్షమాపణను ముస్లిం సమాజానికి వారసత్వంగా అందించారు. క్షమించడం, క్షమాపణ కోరడం అంటే బలహీనతకు సంకేతం కాదు. అది ఉత్తమ నైతికతకు నిదర్శనంగా ప్రవక్త ముహమ్మద్(స) ఆచరణాత్మకంగా నిరూపించారు.

క్షమించడం ఎలాగో నేర్చుకోవాలంటే మనిషికి ఉన్న దారి ఒక్కటే. ఖుర్‌ఆన్‌ను కేవలం చదవడమే కాకుండా ఖుర్‌ఆన్‌ను అధ్యయనం చేయాలి. దానితోపాటు క్షమాపణ అనే మాటకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి జీవితాన్ని అధ్యయనం చేయాలి, తద్వారా వాటిని మన జీవితంలో ఆచరించి చూపించాలి.




**(గత సంచిక తరువాయి)**

మన ఎదుటే ఎన్నో అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నా 'మనకెందుకులే!' అన్న ఉదాసీన ధోరణే అత్యధికం. జోక్యం చేసుకుంటే ఎక్కడ మన తలకు చుట్టుకుంటుందోననే బాధ్యతా రాహిత్యం పౌర ధర్మానికే కాదు, మానవత్వానికే విఘాతం. అభాగినుల విషయంలో కావచ్చు, అనైతిక విషయాల్లో కావచ్చు.. ఎక్కడైనా నీతి, న్యాయాలను సమర్థించగలిగే ధైర్యం లోపించిన నాడు, మనం ఆధునిక సమాజంలో నివసిస్తున్నా ఆటవికులతో సమానమే! అందుకే ఖుర్‌ఆన్ ఇలా హితవు పలుకుతుంది:

**దిక్కులేకపోవడం చూసి అణచి వేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) "ఓ మా ప్రభువా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారి నెవరినైనా నీ వైపు నుండి మా దగ్గరికి పంపు" అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడిత ప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?**

**(అన్ నిసా: 75)**

అంటే, పాపం వల్ల ధర్మం, అసత్యం వల్ల సత్యం గట్టెక్కలేక చెడి పోయిన దుస్థితిలో ఉన్నప్పుడు సమర్థులైనవారు దానిని ఉపేక్షిస్తే, అది వారి తప్పవుతుందని, అది వారికి కీడూ కలిగిస్తుంద'ని హెచ్చరిస్తుంది ఖుర్‌ఆన్.

### ఆత్మపరిశీలన కూడా ఆధ్యాత్మికతే

పారమార్థికంగా పురోగమిస్తున్న వ్యక్తి ఇతరుల ప్రవర్తనను సరిదిద్దే ముందు తొలుత తన ప్రవర్తనపై దృష్టి పెడతాడు. పెట్టాలి కూడా. తనలోని లోపాల్ని సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తాడు. ప్రయత్నించాలి కూడా. మన పూర్వీకుల్లోని ఒకరు ఆత్మపరిశీలన ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తూ 'నేను బయట ప్రపంచంలో ఎంతో మంది దుష్టులు ఉన్నారని అనుకునేవాడిని. కానీ, ఒక్కసారి నా హృదయంలోకి తొంగి చూసుకున్నప్పుడు, ఈ ప్రపంచంలో నా కన్నా పరమదుష్టుడు వేరొకరు లేరని నాకు అర్థమైంది' అన్నారు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: **కనుక మీరు ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోకండి. మీలో నిజమైన దైవభీతిపరుడెవరో ఆయనకు బాగా తెలుసు.** (అన్-నజ్మ్: 32)

మనల్ని అశాంతికి గురిచేసే కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాలనే మాలిన్యం మన మనసు నుంచి తొలగి పోయేందుకు ఆత్మపరిశీలన ఎంతగానో దోహద పడుతుంది. కానీ, మన మనసులోకి తొంగి చూసుకునేందుకు మనకు సమయం ఉండదు. ఇష్టం ఉండదు. నిజానికి మన మనసులోని మాలిన్యాన్ని పరిశుభ్రం చేసుకోగలిగితే అంతా నిర్మలంగానూ, ప్రశాంతంగానూ ఉంటుంది.

అల్లాహ్ ఇలా అంటున్నాడు : నిస్సందేహంగా ఆత్మప్రక్షాళన చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచిపెట్టినవాడు నాశనమవుతాడు. (అష్-షమ్స్: 9-10)

## అప్పుడే జీవనసార్థకత

నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు: ఎవరైనా మిమ్మల్ని నమ్మి ఏదైనా వస్తువుని మీ దగ్గర భద్రపరిస్తే తిరిగి వారికి సురక్షితంగా అప్పగించండి. ప్రజల మధ్య ఏదైనా వ్యవహారం తీర్చవలసి వస్తే న్యాయంగా తీర్చండి. చూడండి అల్లాహ్ మీకు ఎంత మంచి హితోపదేశం చేస్తున్నాడో! ఆయన సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. (అన్-నిసా: 58)

అల్లాహ్ మార్గంలో (సంపద) ఖర్చుపెట్టండి. చేజేతులా నాశనం కొని తెచ్చుకోకండి. ఉపకారం చేయండి. ఉపకారం చేసేవారంటే అల్లాహ్‌కు మిక్కిలి ఇష్టం. (అల్-బఖరహ్: 195)

అన్యుల నుంచి అరువుగా తెచ్చుకున్న వస్తువుకు అధిక శోభను చేకూర్చి మరీ, అతి భద్రంగా అప్పజెప్పే వారు ఉత్తములు. ఆ వస్తువును స్వప్రయోజనాలకు అవసరమైనంత వినియోగించుకొని యథారూపంలో తిరిగి ఇచ్చేసేవారు మధ్యములు. సదరు వస్తువు రూపురేఖల్ని మార్చి అధ్వానంగా ముట్టజెప్పేవారు అధములు.

రోజువారీ జీవితంలో వాడుకలో వచ్చే సామాన్య వస్తువులు- ఉప్పు, కారం వంటివి కూడా ఇవ్వడానికి మనసొప్పని వారు అధమాతి అధములు. వారు నరకంలో అత్యంత లోతైన లోయ వైల్ లో పడవేయబడ్తారు అని అల్లాహ్ హెచ్చరిస్తున్నాడు. **పరలోక తీర్పును ధిక్కరించే వాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్స హించనివాడు. ప్రార్థన పట్ల అశ్రద్ధ, ఏమరుపాటు వహించేవారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. వారు ప్రతి పనీ లోకుల మెప్పు కోసం ప్రదర్శనాబుద్ధితో చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణ వస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు. (అల్-మాఊన్: 1-7)**

అల్లాహ్ మనిషిగా పుట్టించి సృష్టి శ్రేష్టునిగా చేశాడు. మనిషిగా పుట్టించినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతగా సార్థక జీవనాన్ని గడిపి, నలుగురి జీవితాల్లో వెలుగులు నింపి ఆయన ప్రసన్నతలు పొంది, కీర్తిశేషులై తమ పేరును నిలబెట్టుకునేవారు ఉత్తములు. 'నేను, నా వాళ్లు' అంటూ స్వార్థపరులుగానే జీవించేవారు మధ్యములు. అల్లాహ్ నిర్దేశించిన ధర్మమార్గాన్ని అతిక్రమించి, అస్తవ్యస్త జీవనాన్ని గడుపుతూ, అంది వచ్చిన సువర్ణావకాశాన్ని వృథా చేసుకునేవారు అధములు. అందుకే ముందు మంచి మనిషిగా జీవించటం అలవరచుకోవాలి. మానవత్వాన్ని ఇనుమడింప జేసుకోవాలి! అప్పుడు మన ఆరాధ్య ప్రభువు అయిన అల్లాహ్ సంతుష్టుడవుతాడు. ప్రజలు కూడా సంతోషిస్తారు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: హజ్రత్ అబుల్ అబ్బాస్ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి, "దైవప్రవక్తా! దేవుడు, ప్రజలు నన్ను అభిమానించా లంటే ఏం చెయ్యాలో చెప్పండి" అని అడిగాడు. "లోకం పట్ల అనాసక్తత చూపు. అల్లాహ్ నిన్ను ప్రేమిస్తాడు. ఆ తర్వాత ప్రజల దగ్గర ఉన్నవాటి పట్ల అనాసక్తత కనబరచు. అప్పుడు ప్రజలు నిన్ను అభిమానిస్తారు" అని సమాధాన మిచ్చారు దైవప్రవక్త (స).(సుననె ఇబ్నెమాజాలోని ఐహిక అనాసక్తత ప్రకరణం)

## జిహ్వతోనే జీవితం

ఒంటె బ్రహ్మజెముడు మొక్కల్ని ఇష్టంగా తింటుంది. ముళ్లు గుచ్చుకుని నోట్లోంచి రక్తం కారుతున్నా తినడం మానదు. అది దాని ఆహారం. అయితే మనం కూడా కొన్ని కొన్ని సందర్భాల్లో ఒంటెల్లాగే శరీర తత్వానికి పడని, డాక్టరు కచ్చితంగా కూడదు అన్నవి, అల్లాహ్ నిషేధించినవి - నాలుకను అదుపులో పెట్టుకోలేక తింటూ ఉంటాం. కడుపులో మంట, అల్సర్లు వస్తే మందులు వాడతాం, అదుపులోకి రాగానే మళ్లీ అదే తిండి, రక్తపోటు, మధుమేహం... ఏ జబ్బైనా సరే, మందులతో కాస్త తగ్గిందంటే చాలు మళ్ళీ నాలుక రుచుల్నే కోరుతుంది. దానివల్ల ఆరోగ్యం, మనసుపైన నియంత్రణ పోతాయి. చేప జిహ్వ చాపల్యంతో ఎరకు చిక్కి ప్రాణాలు కోల్పోతుంది. నాలుకను ఒక్కదాన్ని భాషణ, భోజన విషయంలో నియంత్రించగలిగితే, అన్ని ఇంద్రియాలపై నియంత్రణ సాధించవచ్చు.

గుర్రం పరుగును నియంత్రించేందుకు రౌతు దానికి కళ్లెం వేసినట్లే, మనం కూడా నాలుకకు పగ్గాలు బిగించాలి. తప్పు దోవ పట్టకుండా మనసును నియంత్రించాలంటే- ముందుగా ఆహారపు అలవాట్లపై నియంత్రణ తెచ్చుకోవాలి. తినకూడదు అన్నవాటికి, అనుకున్న వాటికి దూరంగా ఉండగలగాలి. మాట మీద అదుపుండాలి. వైద్యుడు మన నాలుకను చూసి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నట్లే నాలుక మన ఆత్మీయ స్థితిని చెబుతుందని పెద్దల మాట. ఎంతో చిన్నదైన నిప్పురవ్వ విస్తారమైన అడవిని తగులబెడుతుంది. నాలుక కూడా అగ్ని వంటిదే. ప్రపంచాన్నంతటినీ వశపరుచు కోవడానికి ప్రయత్నించే మనిషి- ముందు తన నోటిని స్వాధీనంలో ఉంచుకోవడం అవసరం.




**- మదీహా అర్జుమంద్**

**ఒకప్పుడు** ప్రజలు తమ మనో భావాలను బహిరంగంగా పంచుకోవడం అంత సులభం అయ్యేది కాదు. వేదికల కొరత, భయాలు, పరిమిత అవకాశాలు.. ఇవన్నీ ఆలోచనలకు అడ్డుకట్టలుగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారి పోయింది. ప్రపంచంలోని ఏ మూలన ఉన్న వ్యక్తైనా ఒక్క క్లిక్‌తో తన మనో భావాన్ని ప్రపంచం మొత్తానికి వినిపించ గలుగుతున్నాడు. ఈ గణనీయమైన మార్పుకు కారణం 'సోషల్ మీడియా.'

సాంకేతిక పురోగతితో కలసి వచ్చిన ఈ వేదిక మానవ సంభాషణ తీరును మాత్రమే కాదు, మానవ సంబంధాల స్వరూపాన్ని కూడా ప్రభావితం చేసింది. అభిప్రాయ స్వేచ్ఛకు, సామాజిక చైతన్యానికి, దాదాపు ప్రతి పౌరుడికి ప్రాప్తించగల ఓ వేదికగా ఇది మారింది. సోషల్ మీడియా దినోత్సవాన్ని 2009 జూన్ 30న మాషబుల్ అనే డిజిటల్ మీడియా సంస్థ వ్యవస్థాపకుడు పీట్ క్యాష్మోర్ న్యూయార్క్ నగరంలో ప్రారంభించాడు. అప్పటి నుంచి ఇది ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ మాధ్యమాల ప్రాముఖ్యతను చర్చించే అంతర్జాతీయ వేదికగా నిలిచింది.

అరబ్ స్ప్రింగ్ ఉద్యమం (2010- 12), ఫర్గూసన్ నిరసనలు (2014), బ్లాక్ లైవ్స్ మ్యాటర్ ఉద్యమం (2020), ఇవన్నీ సామాజిక వివక్షను వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజా గళాన్ని వినిపించిన నిరసన ఉద్యమాలు. సంప్రదాయ మీడియా వెనకబడిన చోట, సోషల్ మీడియా వీటికి చైతన్య వేదికగా నిలిచింది. సోషల్ మీడియా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన సంఘటనలివి.

అయితే ఇదే వేదిక అసత్య ప్రచారాలకు, ద్వేషపూరిత వ్యాఖ్యలకు కూడా తలుపులు తెరిచింది. 2020 ఢిల్లీ హింసల సమయంలో వక్రీకరించిన వీడియోలు సామాజిక ఉద్రిక్తతలకు దారి తీశాయి. అదే సంవత్సరం రైతుల ఉద్యమంపై 'ఖలిస్తానీ' ముద్ర వేసే ప్రచారం, వాస్తవాన్ని సామాజిక వేదికలలో ఎలా వక్రీకరించవచ్చో తేటతెల్లంగా చూపించింది. నిజం నిదానంగా వెళుతుంది, అబద్ధం ఆఘ మేఘాలపై .. అన్నది ఇప్పటి డిజిటల్ ప్రపంచపు వాస్తవం.

సోషల్ మీడియా ద్వారా ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ లభించినట్లు అనిపించినా, ఆ స్వేచ్ఛ అసహనంతో నిండిపోతోంది. అభిప్రాయాలు చర్చకు దారి తీయాల్సిన చోట, వ్యక్తిగత దూషణలు ఎక్కువయ్యాయి. గౌరవంగా ఏదైనా భావన పంచుకుంటే, దానిపై సమీక్ష/ సద్విమర్శ కాకుండా వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయి.

పలువురు ఈ కారణంగానే విమర్శలు ఎదుర్కొంటున్నారు, లేదా అరెస్టులు ఎదుర్కొన్నారు. మనీషా సోనావనే, సాయిపల్లవి, జుబైర్, కన్నన్ గోపీనాధన్ ఐఏఎస్, ధన్యరాజేందర్‌ల ఉదాహరణలు మన ముందున్నాయి. ఇదే సమయంలో ద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలేమి లేకపోవడం కూడా కనిపిస్తోంది.

### డిజిటల్ జీవితం - వాస్తవ జీవితాల మధ్య అంతరం

ఇప్పుడు అనుబంధాలు, సంబంధాలు డిజిటల్ లెక్కలతో కొలవబడు తున్నాయి. లైక్స్, షేర్స్, ఫాలోవర్స్ సంఖ్యే సంబంధాల గాఢతను నిర్ణయిస్తు న్నట్టుగా మారింది. ఇది మానవ సంబంధాల విలువను తగ్గిస్తోంది. యువతలో ఈ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. డబ్ల్యూ హెచ్ ఓ నివేదికల ప్రకారం, సోషల్ మీడియా అధిక వినియోగం కారణంగా ఒత్తిడి, ఒంటరి తనం, డిప్రెషన్‌లను ఎదుర్కొంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, తదితర సామాజిక వేదికలపై చూపించ బడుతున్న జీవితం వాస్తవ జీవితం కాదని చాలా మందికి తెలిసినా, అందుకు తాము కూడా అనుగుణంగా మారాలని అనుకోవడం వల్ల అనేక మందిలో అసంతృప్తి, అసమర్థత భావాలు పెరుగుతున్నాయి. మానవ సంబంధాలకు మానవతా స్పర్శ అవసరం, అది డిజిటల్ రాపిడితో సాధ్యం కాదు. దానికి సానుభూతితో కూడిన పరస్పర ఆత్మీయ సంబంధాల అవసరం ఉంది.

### మార్పు మొదలయ్యేది మన దృష్టికోణం నుంచే...

ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాను నిషేధించాలన్న ప్రతిపాదన సమస్యకు పరిష్కారం ఎంతమాత్రం కాదు. దాని వినియోగాన్ని బాధ్యతగా తీర్చిదిద్దడమే అసలైన పరిష్కారం. ప్రభుత్వాల నియంత్రణలు అవసరమే అయినా, అవి ప్రజల స్వేచ్ఛను హరించేలా ఉండకూడదు. వాస్తవాన్ని నిర్దిష్టంగా అందించే యంత్రాంగాలు అభివృద్ధి చెందాలి. పౌరులుగా మనకు ఉండాల్సిన అవగాహన, సత్యనిష్ఠ, పరస్పర గౌరవమే దీన్ని సమాజానికి ఉపయోగపడే సాధనంగా మలుస్తాయి.

సోషల్ మీడియా ఒక ప్రజా వేదిక. అది దారిదీపంలా ప్రజల్ని చీకటి నుంచి రక్షించి, వెలుగు వైపునకు నడిపించాలంటే, ప్రతి పోస్టు, ప్రతి కామెంట్, ప్రతి షేర్ బాధ్యతతో కూడినదై, మానవతతో నిండినదై ఉండాలి. స్వేచ్ఛ అనేది యాదృచ్ఛికంగా లభించదు. దానికి బాధ్యత అనుసంధానమవ్వాలి. ఎదుటివారి మాటను బట్టి మనం వినే తీరు, స్పందించే ధోరణి మారిపోవాలి. సామాజిక వేదికల శక్తిని మనం ఎలా వినియోగిస్తున్నామో ఒకసారి గంభీరంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. కనుక మానవ సంబంధాలు డిజిటల్ సంబంధాలు కాకుండా మానవీయ స్పర్శతో పరస్పర ప్రేమ, గౌరవం, విలువలు బలపడాలని కోరుకుందాం. ఏమంటారు?


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




ఆయిషా సుమయ్యా

**ఆత్మ విశ్వాసం విజయాలకు మూలం.** ఆత్మవిశ్వాసమంటూ ఉంటే ఎన్ని అడ్డంకులనైనా అలవోకగా తొలగించుకోవచ్చు. విజయాలను అందిపుచ్చుకోవచ్చు. ఆత్మవిశ్వాసం లేని వ్యక్తి తన సామర్థ్యాన్ని తానే శంకిస్తాడు. తలపెట్టిన పని పూర్తి చేయగలననే నమ్మకమే లేకపోతే ఎంత శ్రమించినా ఫలితం ఉండదు. ఆత్మ విశ్వాసంతో కూడిన సంకల్ప బలం విజయానికి ప్రాణం లాంటిది.

కొందరిలో తగిన సామర్థ్యాలు, నైపుణ్యాలైతే ఉంటాయి కాని ఆత్మ విశ్వాసంతో ఉండరు. ఎంతోమంది అంగవికలురు సైతం తమ ఆత్మవిశ్వాసంతో తమ జీవితాల్లో అనూహ్యమైన విజయాలు సాధించారు. వికలాంగులైనా వారి విజయాల వెనుక ఉన్న రహస్యమేమిటి? అదే వారిలోని ఆత్మ విశ్వాసం. వారిలోని ఆత్మ విశ్వాసమే వారిలో చైతన్యం నింపింది. ఎన్ని అవరోధాలు ఎదురైనా వారు మడమ తిప్పకుండా ముందుకు సాగారు. అనుకున్నది సాధించగలిగారు. వారిలోని ఆత్మ విశ్వాసం వారిని విజయ తీరాలకు చేర్చింది.

హెచ్.జీ. వేల్స్ ప్రముఖ రచయిత. ఒకసారి ఆయన ఆరోగ్యం చెడింది. మంచం మీద నుంచి లేవలేని స్థితి ఆయనది. అలాంటి స్థితిలో కూడా ఆయన ఓ నవల రాశాడు. అది ఎంతో ప్రసిద్ధి చెందింది, మంచి పేరు తెచ్చి పెట్టింది. అనారోగ్యంతో ఉన్నాను, నేను ఏ పనీ చేయలేను అని ఆనాడు అతను భావించి ఉంటే ఆ నవలను రాసి ఉండేవాడా? అతనికి ఆ పేరుప్రతిష్ఠలు కూడా వచ్చి ఉండేవా? ఆత్మ విశ్వాసం ఉంటే అనారోగ్యం నుండి కూడా త్వరగా కోలుకోవచ్చు. మరి ఆ ఆత్మ విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి?

మొదటి విషయం ఏమిటంటే, ఏ పని చేయాలనుకున్నా పూర్తి ఆత్మవిశ్వాసంతో 'నేను ఈ పనిని తప్పకుండా చేయగలను' అనే నమ్మకంతో ఉండాలి. సందేహాన్ని దరి రానీయకూడదు. ఈ క్రమంలో అవసరమైతే భావసారూప్యత గల మిత్రుల సహాయాన్ని తీసుకోవాలి. వారి వల్ల మంచి ప్రోత్సాహం కలిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ మీకు మిత్రులే లేకపోతే మీ అంతరాత్మనే మీ మిత్రునిగా చేసుకోండి. ఒకవేళ తలపెట్టిన పనిలో మీరు విఫలం అయితే భయపడకండి. ఎందుకంటే వైఫల్యాలే విజయానికి సోపానాలు. ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయండి. మీలో ఉన్న సామర్థ్యాన్నే నమ్ముకోండి. మీరు మొదలు పెట్టిన పనిని ఎలాగైనా పూర్తి చేయాలనే సంకల్పాన్ని బలపర్చుకోండి. దాని కోసం నిరంతరం కృషి చేయండి.

కొంతమంది తమ వైఫల్యాన్ని దురదృష్టంగా భావించి నిరాశా

నిస్పృహలకు గురవుతారు. మళ్లీ దాని గురించి ఆలోచిం చరు. ఇతరులు తమను అవహేళన చేస్తారని, ఆటపట్టిస్తారని భావిస్తారు. అలా తమ విజయాలకు తామే అడ్డుకట్ట వేసుకుంటారు.

ఆత్మవిశ్వాసం లోపించిన వారు ఇలానే సందేహపడుతుంటారు. ప్రపంచంలో అందరూ ఆనందంగా, సంతోషంగా ఉన్నారు, నేనొక్కడినే కష్టాల్లో ఉన్నానన్న ఆలోచనలతో సతమతమవు తారు. ఇతరుల్లాగా ఆనందంగా గడపలేమా అనే సందేహిస్తారు. ఆ సందేహం రావడం సహజమే. కాని దాన్ని పొందాలంటే ఆత్మ విశ్వాసం కావాలి. అప్పుడే ఆనందం పొందగలరు. అలా జరగా లంటే మీరు ఇతరుల గురించి ఆలోచించడం మానుకోవాలి. ఇతరులు నా గురించి ఏమనుకుంటారో అన్న సందేహాన్ని వీడాలి. కష్టాల్లో ఉన్నప్పుడు అందరూ దూరమవడానికి ప్రయత్నిస్తారు. చేరదీసేవారు చాలా కొద్ది మంది మాత్రమే కనబడతారు. వారి సహాయంతోనే కష్టాలను ఎదుర్కోవాలి.

ఒక్కసారి విఫలం అయినంత మాత్రాన పోయేదేమీ లేదు. వైఫల్యానికి గల కారణాలను తెలుసుకోవాలి. దాన్ని సరిచేసు కోవాలి. మళ్లీ ప్రయత్నించాలి. అలా పని పూర్తయ్యేవరకు ప్రయత్నిస్తూనే ఉండాలి. నిరంతర ప్రయత్నమే విజయానికి తోడ్పడుతుంది. వైఫల్యాలకు నిరుత్సాహపడకూడదు. ప్రయత్నమే సగం విజయం అని అందుకే అంటారు.

### ఆత్మవిశ్వాసం కోసం...

మిమ్మల్ని మీరు తక్కువగా అంచనా వేసుకోకండి. మీరు ఏదైనా సాధించగలరు. మీరు చేస్తున్న పనులపై సంతృప్తికరంగా ఉండండి. గత వైఫల్యాలకు క్రుంగిపోకండి. భవిష్యత్తుపై దృష్టి పెట్టండి. మీలో ఉన్న లోటుపాట్లను, నైపుణ్యాలను, సామర్థ్యాలను వెలికి తీయండి. నిరాశా నిస్పృహలను దరి చేరనివ్వకండి. ఆత్మ విశ్వాసంతో పనులు చేయండి. లక్ష్యం మీద దృష్టి పెట్టండి. పని మధ్యలో అలసత్వాన్ని దరి చేరనివ్వకండి. శక్తిసామర్థ్యానికి మించిన పనులను కూడా నెత్తిన వేసుకోకూడదు. మనిషికి ఆశ ఉండాల్సిందే కాని అత్యాశ ఉండకూడదు. తాబేలు, కుందేలు కథ తెలియనిదెవరికి? పరుగెత్తడం రాని తాబేలు గెలిచింది, బాగా పరుగెత్తగల కుందేలు మితిమీరిన ధీమాతో ఓడిపోయింది. కుందేలు నాకంటే బాగా పరిగెత్తుతుంది నేను ఎలాగూ ఓడిపోతాను! అన్న ఆలోచన రానివ్వకుండా నేనెలాగైనా గెలవాలి అన్న ఆత్మవిశ్వాసంతో తాబేలు ముందుకు సాగింది. తన లక్ష్యం మీద దృష్టి పెట్టింది, గమ్యం వైపు దూసుకుపోయింది, అనుకున్నది సాధించింది. ఇది కథే కావచ్చు. కాని లక్ష్యం మీద దృష్టి సారించి పని మీద ఏకాగ్రత కనబరుస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితే విజయం వరిస్తుందనే నమ్మకం కలిగించ టానికి ఇదొక చక్కటి మంత్రం.

### ఆత్మవిశ్వాసం గల వారి లక్షణాలు..

- సంతోషాలను నలుగురితో పంచుకుంటారు
- ఎలాంటి కల్మషం లేకుండా ఉంటారు
- ఆశావహ దృక్పథం కలిగి ఉంటారు
- సవాళ్లకు బెదరరు
- చిరునవ్వుతో పలకరిస్తారు
- స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటారు
- ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ పురోగతి సాధిస్తారు
- తప్పులు ఒప్పుకుంటారు
- బాధ్యతలను స్వీకరిస్తారు

### ఆత్మన్యూనత గలవారు

- ఇతరులను నిందిస్తూ, అసూయ చెందుతారు
- మూసపు ఆలోచనలను కలిగి ఉంటారు
- నిరాశగా ఉంటారు
- మార్పులకు భయపడతారు
- తమలోని లోపాలను, తప్పులను ఒప్పుకోరు
- సరైన నిర్ణయాలు తీసుకోలేరు
- అన్నీ తెలుసన్నట్లు ప్రవర్తిస్తారు
- ప్రతీదానికీ సాకులు వెతుకుతారు
- తప్పులను ఇతరుల మీద ఎగదోస్తారు.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గేటురాయి
వారపత్రిక




## వాతావరణాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌లు

వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు ప్రజలు, రైతులకు సవాల్‌గా మారుతున్నాయి. అకాల, భారీ వర్షాలు సైతం పంటలను దెబ్బతీస్తూ రైతులకు తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయి. మరోవైపు పిడుగులు పడి ఏటా ప్రజల మరణాలు పెరుగుతున్నాయి. దీంతో ఏయే ప్రాంతాల్లో వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉంది.. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఎక్కడ ఉంది.. తదితర సమాచారాన్ని ప్రజలు, రైతులు సులువుగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం దామిని, రెయిన్ అలారమ్, మేఘ్‌దూత్, కిసాన్ సువిధ వంటి ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లతో వాతావరణ పరిస్థితులను సులభంగా తెలుసుకోవచ్చని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ యాప్‌ల్లో వాతావరణ పరిస్థితులతోపాటు పంటలకు మార్కెట్ ధరలు, బీమా సదుపాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందస్తు హెచ్చరికలు, నీటి నిర్వహణ, విత్తనాలు, ఎరువుల సమాచారం కూడా లభిస్తుందని పేర్కొంటున్నారు.

## జూలైలో సాధారణం కన్నా అధిక వర్షాలు

దేశంలోని చాలా ప్రాంతాల్లో జూలై నెలలో సాధారణం కన్నా అధిక స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. మధ్య భారతం, ఉత్తరాఖండ్, హర్యానాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. వరదలు సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. ఈశాన్య, తూర్పు భారతంలోని చాలా ప్రాంతాల్లో, దక్షిణాదిలో చివరి ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ స్థాయిలో వర్షాలు కురియవచ్చునని తెలిపింది. సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం నుంచి సాధారణం కన్నా తక్కువ స్థాయిలో  ఉండవచ్చునని పేర్కొంది. ఈశాన్య, వాయువ్య, తూర్పు, దక్షిణ భారతదేశ ప్రాంతాల్లో సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చునని చెప్పింది. ఐఎమ్‌డీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. జూలై నెలలో సగటున 28 సెం.మీ. వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. ఈ ఏడాది జూలైలో తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో చాలా చోట్ల భారీ వర్షాలు కురియొచ్చున్నారు.

## డిశ్చార్జికి ముందే బర్త్ సర్టిఫికెట్

ఆస్పత్రుల్లో జన్మించిన నవజాత శిశువులకు వారు డిశ్చార్జి కావడానికి ముందే తల్లులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) రాష్ట్రాలను కోరింది. ప్రధానంగా 50 శాతం పైగా జననాలు జరిగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. జనన నమోదు పూర్తయిన తర్వాత రిజిస్ట్రార్ వీలైనంత త్వరగా బర్త్ సర్టిఫికెట్‌ను ఎలక్ట్రానిక్ లేదా ఏ ఇతర ఫార్మాట్‌లోనైనా మంజూరు చేయాలని తెలిపింది. ఇందుకు ఏడు రోజుల కంటే సమయం మించరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్‌జీఐ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రిజిస్ట్రేషన్ యూనిట్లుగా పనిచేస్తున్నాయని పేర్కొంది. బర్త్ సర్టిఫికెట్‌కు పెరిగిన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని, దాన్ని తక్షణం జారీ చేయాల్సిన అవసరాన్ని ఆయా యూనిట్ల రిజిస్ట్రార్‌లు గుర్తించాలని సూచించింది. 2023, అక్టోబరు 1 నుంచి విద్యా సంస్థల్లో అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలు, వివాహ నమోదు తదితర అవసరాలకు డిజిటల్ బర్త్ సర్టిఫికెట్ అనేది పుట్టిన తేదీకి ఒకేఒక్క ఆధారంగా ఉంది. జనన, మరణాల నమోదు చట్టం- 1969 ప్రకారం జనన ధ్రువీకరణ పత్రాన్ని జారీచేస్తూ వస్తున్నారు. అన్ని జననాలు, మరణాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో  నమోదు చేయడాన్ని 2023, అక్టోబరు 1 నుంచి తప్పనిసరి చేశారు.

## 2026 ఏప్రిల్ 1 నుంచి ఇండ్ల నమోదు.. జనగణనపై రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వెల్లడి

జన గణన తొలి దశలో భాగంగా ఇండ్ల నమోదు 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుందని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా తెలిపారు. ఈ మేరకు జన గణన కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు లేఖ రాశారు. సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్ల నియామకానికి ముందే వారి మధ్య పని విభజన జరగాలని, రాష్ట్ర, జిల్లాల యంత్రాంగాల సహకారంతో దీన్ని పూర్తి చేయాలని ఆయన కోరారు. జనగణన మొదటి దశలో ఇండ్ల నమోదు ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంటి స్థితిగతులు, ఆస్తులు, సౌకర్యాల వివరాలను నమోదు చేస్తారు. రెండో దశలో జనాభా గణన, పౌరుల సామాజిక-ఆర్థిక, సాంస్కృతిక తదితర వివరాలను నమోదు చేస్తారు.

## ప్రాణాలు తీస్తోన్న ఒంటరితనం

ప్రపంచవ్యాప్తంగా ఒంటరి తనం పెద్ద సమస్యగా మారుతోంది. ఒంటరితనం కుంగుబాటుకు.. ఆపై ఆత్మహత్య ఆలోచనలకు దారి తీస్తోంది. ఇలా ఏటా ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన 'కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్' తన తాజా అంతర్జాతీయ నివేదికలో పేర్కొన్న గణాంకాలే ఇందుకు నిదర్శనం. ఆ నివేదిక ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతు న్నారు. ప్రతి గంటకు దాదాపు 100 మరణాలు.. ఏడాదికి 8.71లక్షల మరణాలు నమోదవుతున్నాయి. డబ్ల్యూహెచ్‌వో కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్ సహాధ్యక్షుడు డాక్టర్ వివేక్ మూర్తి కూడా.. ఒంటరితనం అనేది ఈ తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్‌గా అభివర్ణించారు. 'డిజిటల్‌గా అనుసంధానమైన ఈ ప్రపంచంలో.. చాలామంది యువతీ యువకులు తమను తాము ఒంటరి వ్యక్తులుగా భావించుకుంటున్నారు. పెరుగుతున్న టెక్నాలజీని మన బలంగా మార్చుకోవాలి తప్ప బలహీనతగా కాదు.

## మమ్దానీ మెచ్చిన మేయర్..

జోహ్రాన్ మమ్దానీ.. ప్రపంచం మొత్తం ఇప్పుడు చర్చనీయాంశంగా మారిన భారత సంతతి వ్యక్తి. న్యూయార్క్ నగర మేయర్ పదవి రేసులో అభ్యర్థిగా నిలబడిన ఈ 33 ఏళ్ల యువ నాయకుడి ప్రచార శైలి, ఎన్నికల హామీల గురించే అక్కడి జనం చర్చించు కుంటున్నారు. ఈ క్రమంలో భారత్‌కు చెందిన ఓ యువ నేత గురించి ఆయన చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆర్య రాజేంద్రన్.. ఈ పేరు గుర్తుందా? కేవలం 21 ఏళ్ల వయసులో తిరువనంతపురం మేయర్ పదవి చేపట్టారు. తద్వారా దేశంలోనే అత్యంత చిన్నవయసులో మేయర్‌గా ఎన్నికైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. అయితే ఆ టైంలో తన సోషల్ మీడియా ఖాతాలో మమ్దానీ ఈ విషయాన్ని ప్రస్తావించడం ఇప్పుడు హైలైట్ అవుతోంది. న్యూయార్క్‌కు ఎలాంటి మేయర్ అవసరం? రాజేంద్రన్ లాంటి నేత అవసరం అంటూ పోస్ట్ చేశారాయన. డెమొక్రటిక్ పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా మమ్దానీ ఎన్నికైన తరుణంలో ఆ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

## షేక్ హసీనాకు 6 నెలల జైలు శిక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ICT) 6 నెలల జైలుశిక్ష విధించింది. ఐసీటీ చైర్మన్ జస్టిస్ ఎండీ గోలం ముర్తుజా నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించినట్టు 'ఢాకా ట్రిబ్యూన్' తెలిపింది. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రిబ్యునల్ షేక్ హసీనాకు గత జూన్‌లో అరెస్టు వారెంట్ జారీ చేసింది. బంగ్లా నుంచి పారిపోయిన 11 నెల తర్వాత హసీనాకు ఒక కేసులో జైలుశిక్ష పడింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి, ఆందోళనలు పతాక స్థాయికి చేరుకోవడంతో 2024 ఆగస్టు 5న షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఢాకాలోని అధికార నివాసాన్ని ఖాళీ చేసి దేశం వదిలిపెట్టారు.

## అమెరికాపై మాదే విజయం

అమెరికాపై తాము విజయం సాధించామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అన్నారు. ఇజ్రాయెల్- ఈరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక ఆయన తొలిసారి ఈ యుద్ధంపై స్పందించారు. 10 నిమిషాల నిడివి గల వీడియోను విడుదల చేశారు. దాన్ని ఈరాన్ అధికారిక వార్తా చానల్ ప్రసారం చేసింది. ఆ వీడియోలో ఖమేనీ పలుమార్లు అమెరికా, ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. "12 రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్‌పై మేమే విజయం సాధించాం. పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన అతి పెద్ద బేస్‌పై దాడులు చేశాం. ఇవి అమెరికాకు చెంపదెబ్బ లాంటివే..! మరోమారు అమెరికా దుస్సాహసం చేస్తే.. మా క్షిపణులు అమెరికాను తాకుతాయనే సంకేతాన్నిచ్చాం" అని వ్యాఖ్యానించారు.

## పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన క్వాడ్ దేశాలు

జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడిని క్వాడ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రదాడికి కారణమైన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశాయి. వీలైనంత త్వరగా న్యాయం జరుగుతుందని అన్నాయి. ఇటీవల స్క్వాడ్ దేశాల మీటింగ్ జరిగింది. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల విదేశాంగ మంత్రులు ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గామ్ ఉగ్రదాడిపై ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. 'ఉగ్రవాదాన్ని, తీవ్రవాద చర్యల్ని క్వాడ్ ముక్త కంఠంతో ఖండిస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కలిసి కట్టుగా క్వాడ్ దేశాలు పోరాటం చేస్తాయి. ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని క్వాడ్ ఖండిస్తోంది. ఈ దాడిలో 25 మంది భారతీయులు, ఒక నేపాల్ వ్యక్తి చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు క్వాడ్ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది. గాయపడిన వారు వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తోంది. పహల్గామ్ ఉగ్రదాడికి వ్యూహ రచనలు చేసిన వారిని.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిని ఎలాంటి ఆలస్యం చేయకుండా యూఎన్ శిక్షించాలి' అని పేర్కొన్నారు.

# అసలైన సంతోషం

**- అబ్దుల్ సత్తార్**


**"అల్లాహ్** నీ తలరాతలో రాసిన దాన్ని సమ్మతించి తృప్తి పడు, అందరిలోకెల్లా ధనవంతుడవు అవుతావు" అన్నారు ముహమ్మద్ ప్రవక్త (స) మహనీయులు. ఆత్మతృప్తికి మించిన సంపద మరొకటి ఉండదు. ఆత్మతృప్తి లేనివారికి ఎన్నెన్ని భోగభాగ్యాలున్నా ఇంకా ఏదో కావాలనే పేరాశతో సంతోషాలన్నీ దూరం చేసుకుంటారు. మనిషికి ఒక లోయ బంగారం దొరికినా మరో లోయ బంగారం కావాలం టాడని మనిషి అత్యాశను గురించి చెప్పారు ప్రవక్త(స). ఆత్మతృప్తి యొక్క ఔన్నత్యాన్ని తెలియజేసే కథ ఒకటి ప్రచారంలో ఉంది...

రాజుగారు ఎప్పుడూ నిరాశతోనే ఉండేవారు. దీంతో ఆయన ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించసాగింది. పాలనా వ్యవహారాలు కుంటుపడ్డాయి. పాలన గాడి తప్పింది. ఇది గమనించి రాజుగారి కుటుంబ సభ్యులు, మంత్రులు, అధికారులూ రాజు ఆరోగ్యం పట్ల ఆందోళన చెందసాగారు. ఆస్థాన వైద్యుణ్ణి పిలిపించారు. వైద్యుడు రాజును అన్ని విధాలా పరీక్షించాడు. రాజుకు ఎలాంటి శారీరక ఆరోగ్య సమస్యలు లేవని తేల్చి చెప్పాడు. కేవలం నిరాశా నిస్పృహలకు లోనై చేజేతులా ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారని వైద్యుడు చెప్పాడు. ''రాజ్యంలో ఎవరైతే సుఖసంతోషాలతో, ఆత్మతృప్తిగా ఉంటారో అలాంటి వ్యక్తి చొక్కాను రాజుగారు ధరిస్తే మళ్లీ మామూలు మనిషవుతార"ని వైద్యుడు సలహా ఇచ్చాడు.

మంత్రి తనకు కావాల్సిన వ్యక్తి జాడకోసం రాజ్యమంతా కనబడ్డవారినల్లా అడిగాడు. కానీ ఫలితం లేకపోయింది. దీంతో నిరాశ చెంది రాజ దర్బారువైపు తిరుగు ప్రయాణ మయ్యాడు. దారి మధ్యలో ఒక చిన్న గుడిసెలోంచి వస్తున్న మాటల శబ్దం అతన్ని ఆకర్షించింది. ఆ మాటలు విని మంత్రి ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాడు. ఆ గుడిసెలోంచి, ''ఓ అల్లాహ్! నువ్వు ఎంతో కరుణామయుడవు. నీ కృపతో నా జీవితం ఎంతో సంతృప్తికరంగా, సుఖసంతోషాలతో గడుస్తోంది" అన్న మాటలు మంత్రి చెవిన పడ్డాయి. ఈ మాటలు విని సంబరపడిపోయాడు. గుడిసెలోకి వెళ్లి ఆ వ్యక్తి ధరించిన చొక్కాను అడిగాడు. అందుకు ప్రతిఫలంగా రాజుగారు అతనికి ఎన్నో విలువైన బహుమతులను ఇస్తారన్న విషయమూ అతనికి చెప్పి చొక్కాను చేతిలో పట్టుకుని సంతోషంతో రాజదర్బారువైపు గుర్రాన్ని దౌడు తీయించాడు. చిరిగిపోయి, అతుకులు వేయబడ్డ ఆ చొక్కాను తీసుకువచ్చి రాజు చేతిలో పెట్టాడు. జరిగినదంతా వివరించాడు. జరిగిన సంఘటన మొత్తం విన్న రాజుకు కళ్లు తెరుచు కున్నాయి. ''గుడిసెలో ఉండి కట్టుకోవడానికి బట్టలు కూడా సరిగా లేని ఓ నిరుపేద దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ సంతృప్తిగా, సంతోషంగా ఉన్నాడు. నేను భోగభాగ్యాలు, అధికారం, హోదా, దర్పం అన్నీ అనుభవిస్తున్నా నిరాశతో గడుపుతున్నాను'' అని లోలోనే పశ్చాత్తాపం చెందాడు. ఆ మరుక్షణమే రాజు మనసు కుదుట పడింది.

**అవును, మనో లోభత్వం నుండి (పేరాశ నుండి) రక్షింపబడిన వారే సాఫల్యం పొందేవారు.**

**(59: 9)**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**